RNI No. APTEL/2009/28868

ప్రజల కోసం.. ప్రజల పక్షాన..
నిజం మా నడవడి...

సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

PEOPLE ISSUES OUR MISSION

TRUTH BRINGS A BETTER SOCIETY

CITIZEN TIMES TELUGU DAILY

సంపుటి :18 | సంచిక : 353 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 28-10- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ॥

VOLUME: 18 | ISSUE : 353 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 28-10-2026 | PAGES: 8 | PRICE : 2/- RS

ప్రాణ, ఆస్తి నష్టాన్ని వీలైనంతగా తగ్గించడమే లక్ష్యం

హుద్‌హుద్‌తో పోలిస్తే ఈ తుపాను తీవ్రత తక్కువే.. ప్రతి గంటకూ తుపాను హెచ్చరికల బులెటిన్ విడుదల



అమరావతి

అర్నబ్ తుపాను ముప్పును ఎదుర్కొనేందుకు భారీ స్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టామని, ప్రాణ, ఆస్తి నష్టాన్ని వీలైనంతగా తగ్గించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మత్స్యకారులకు చెందిన 30 వేలకుపైగా బోట్లను సముద్రం నుంచి వెనక్కి రప్పించామని, గోపాల్‌పూర్‌లో ఏపీకి చెందిన 93 బోట్లు, వాటి సిబ్బంది సురక్షితంగా ఉన్నారని తెలిపారు. వైద్య సేవల కోసం 1,316 అంబులెన్సులను సిద్ధం చేయడంతోపాటు, 5వేల మంది గర్భిణులను సమీపంలోని ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులకు తరలించినట్లు వెల్లడించారు. విద్యుత్ అంతరాయాలను వెంటనే పునరుద్ధరించేందుకు 8,400 మంది సిబ్బందిని సిద్ధం చేశామని, తుపాను ప్రభావంతో 15 వేల వరకు విద్యుత్ స్తంభాలు పడిపోయే అవకాశం ఉందని అంచనా వేసి ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

హుద్‌హుద్‌తో పోలిస్తే ఈ తుపాను తీవ్రత తక్కువే..

నాగావళి, వంశధార నదులకు వరద వచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉన్నామని, వాగులు, వంకల్లో నీటి ప్రవాహాలను అంచనా వేస్తూ చెరువులకు గండ్లు పడితే వెంటనే పునరుద్ధరించేలా చర్యలు చేపట్టామని చెప్పారు. ముంపు గ్రామాలకు ఆహారం, ఔషధాలు అందించేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నామని, తాగునీటి సరఫరాకు ట్యాంకర్లు, జనరేటర్లను సిద్ధం చేశామని తెలిపారు. సుమారు 7.16 లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 16 లక్షల తరువాయి 2లో..

స్థానిక ఎన్నికలపై పవన్ కీలక వ్యాఖ్యలు.. రెబల్స్‌కు స్పష్టమైన హెచ్చరిక జారీ

పార్టీ బీఫామ్ ఇచ్చినవారే అధికారిక అభ్యర్థులన్న పవన్ కల్యాణ్
మిగిలిన వారు నామినేషన్లు ఉపసంహరించుకోవాలని సూచన
కూటమి స్ఫూర్తితో అధికారిక
అభ్యర్థుల గెలుపుకు పనిచేయాలని పిలుపు తరువాయి 2లో..

'అర్నబ్' ఎఫెక్ట్.. ఉత్తరాంధ్రలో పూర్తిగా మారిన వాతావరణం

పశ్చిమమధ్య బంగాళాఖాతంలో బలపడిన 'అర్ణబ్' తుపాను
గంటకు 20 కి.మీ వేగంతో ఏపీ తీరం
వైపు వేగంగా కదులుతున్న అతి తీవ్ర తుపాను
రేపు ఉదయం బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం
తీరం దాటే సమయంలో గంటకు
125-135 కి.మీ. వేగంతో గాలులు
కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరిక
తరువాయి 2లో..





కడప, సిటిజన్ టైమ్స్

వైకాపా అధినేత జగన్ కంచుకోటను తెదేపా బద్దలు కొట్టింది. కడప జిల్లా పులివెందులలో కూటమి అభ్యర్థులు ప్రభంజనం సృష్టించారు. నియోజకవర్గంలోని 65 ఎంపీటీసీ స్థానాలకుగాను 64 ఏకగ్రీవమయ్యాయి. 7 జడ్పీటీసీ స్థానాలకుగాను 3 ఏకగ్రీవమైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. రాష్ట్రంలో పరిషత్ (జడ్పీటీసీ, ఎంపీటీసీ) ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు ఇవాళ మధ్యాహ్నం ముగిసింది. ఒకే నామినేషన్ దాఖలైన చోట ఏకగ్రీవాలుగా ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు ప్రకటిస్తున్నారు. పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లి మండలంలో 18 ఎంపీటీసీలకు గాను 17 ఏకగ్రీవమయ్యాయి. తెదేపా 15, భాజపా, జనసేన ఒక్కో స్థానంలో ఏకగ్రీవమైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. దీంతో మండలంలోని అల్లిరెడ్డిపల్లె ఎంపీటీసీ స్థానానికి మాత్రమే ఎన్నిక జరగనుంది. పులివెందుల తరువాయి 2లో..

బ్రహ్మపుత్రపై డ్యాం ప్రమాదకరం.. చైనాకు నిపుణుల హెచ్చరిక

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

చైనా ఈ శతాబ్దంలోనే అతి పెద్ద జల విద్యుత్ ప్రాజెక్టును బ్రహ్మపుత్ర నదిపై నిర్మించనుంది. సుమారు 16,800 తరువాయి 2లో..

భయపడొద్దు.. తిరగబడండి

పోలింగ్ రోజున పులివెందులలో ఉంటా..: జగన్
ఈ రెండేళ్లు ఓపిక పడితే వచ్చేది జగన్ 2.0 అన్న జగన్
అన్యాయం చేసిన అధికారులను వడ్డీతో సహా చెల్లించేలా చేస్తామని హెచ్చరిక
పులివెందులలో కార్యకర్తలపై చేయి వేస్తే తనపై వేసినట్లేనని స్పష్టీకరణ

పులివెందుల, సిటిజన్ టైమ్స్

"ఈ రెండేళ్లు ఓపిక పట్టండి.. వచ్చేది జగన్ 2.0" అని పార్టీ శ్రేణులకు వైసీపీ అధినేత జగన్ పిలుపునిచ్చారు. పులివెందులలోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన ఆయన... అధికార కూటమిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పులివెందుల నుంచి మొదలయ్యే ధ్వని రాష్ట్రమంతా వినిపించాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని తుడిచిపెట్టేస్తామని ధీమా వ్యక్తం తరువాయి 2లో..

చెంబరంబాక్కం రిజర్వాయర్‌కు సీఎం విజయ్.. 2015 పునరావృతం కాకూడదని హెచ్చరిక!

చెంబరంబాక్కం రిజర్వాయర్‌ను తనిఖీ చేసిన సీఎం విజయ్
రిజర్వాయర్‌ను 24/7 పర్యవేక్షించాలని సూచన
తుపాను ముప్పు నేపథ్యంలో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

తమిళనాడులో ఈశాన్య రుతుపవనాలు, తుపాను హెచ్చరికల నేపథ్యంలో ముఖ్యమంత్రి విజయ్ క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టారు. 2015 నాటి చెన్నై వరద విపత్తు పునరావృతం కాకుండా చూసేందుకు ఆయన చెన్నై శివారులోని చెంబరంబాక్కం రిజర్వాయర్‌ను స్వయంగా తనిఖీ చేశారు. నీటిమట్టం, ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రిజర్వాయర్‌ను 24 గంటలూ పర్యవేక్షించాలని, నీటి విడుదల విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని విజయ్ ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, వరద తరువాయి 2లో..

ఆర్నబ్ తుపాన్ పై ఏపీ ప్రభుత్వం అప్రమత్తం.. హోంమంత్రి అనిత కీలక సూచనలు

తీరం వైపు దూసుకొస్తున్న ఆర్నబ్ తీవ్ర తుపాన్
రేపు ఉదయం బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం
తీర జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించిన ప్రభుత్వం

అమరావతి, సిటిజన్ టైమ్స్

బంగాళాఖాతంలో ఏర్పడిన 'ఆర్నబ్' తుపాను అతి తీవ్ర తుపాన్‌గా మారింది. ఇది రేపు ఉదయం బాపట్ల-విశాఖపట్నం మధ్య యానాం సమీపంలో తీరం దాటనుందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొత్తం యంత్రాంగాన్ని తరువాయి 2లో..

కొత్త 1000 నోటు మళ్లీ వస్తోందా? కేంద్రం ఏమందంటే?

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

త్వరలో కొత్త రూ.1,000 నోటు చలామణిలోకి వస్తోందంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. అవన్నీ వదంతులేనని స్పష్టం తరువాయి 2లో..

దిల్లీకి 10 లక్షల మంది నిరసనకారులా.. వ్యాపారం చేసేదెలా?: రాహుల్‌కు సీటీఐ లేఖ

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

సీఈసీ రాజీనామా చేయాలనే డిమాండుతో నవంబర్ 1న మెగా ర్యాలీకి పిలుపునిచ్చింది కాంగ్రెస్. అయితే.. పండగ వేళ ఈ ఆందోళన కారణంగా తాము నష్టపోతామని, ర్యాలీని వాయిదా వేసుకోవాలని దేశ రాజధానిలోని వ్యాపార సంఘాలు అభ్యర్థించిన సంగతి తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ సానుకూలంగా స్పందించకపోవడంతో.. తరువాయి 2లో..

ఎడిటోరియల్

జనసేనతో వద్దు... బీజేపీ భయం వెనక ?

జనసేన బీజేపీ మంచి మిత్రులు అన్నది అందరికీ తెలిసిందే. నిజానికి ఏపీలో కూటమి ఏర్పాటు వెనక జనసేన ఉందని కూడా అంటారు. అలా టీడీపీని బీజేపీకి కలిపి బలమైన ఆల్టర్నేషన్ ని తయారు చేయడం వల్లనే వైసీపీ ప్రభుత్వం ఏపీలో కుప్ప కూలింది. అలా ఏపీ నుంచి అతి పెద్ద సంఖ్యలో ఎంపీ సీట్లు అండగా ఉండడం వల్లనే కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావడానికి వీలు కలిగింది. అలాంటిది జనసేన పొత్తు వద్దు అని కమలం పార్టీ ఎలా అనగలదు, అంటే అది ఏపీలో కానే కాదు, తెలంగాణాలో అని అంటున్నారు. ఆ రాష్ట్రంలో బీజేపీ బలమైన రాజకీయ పక్షంగా ఉంది. అక్కడ జనసేన కూడా తన పార్టీని విస్తరించాలని చూస్తోంది. మరి ఏపీలోనూ కేంద్రంలోనూ ఎన్డీయే గొడుగు కింద ఉన్న ఈ రెండు పార్టీలూ తెలంగాణాలో వేరుగా ఎలా ఉండగలవని అంటున్నారు. అది సాధ్యమా అంటే రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే అని అంటున్నారు. తెలంగాణాలో ప్రస్తుతం మహబూబ్‌నగర్ – రంగారెడ్డి – హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గం, అలాగే వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానాలకు ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. తొందరలో అక్కడ ఎన్నికలు ఉండబోతున్నాయి. ఈ ఎన్నికల్లో అందరి కంటే ముందే జనసేన తన అభ్యర్థిని ప్రకటించింది. నల్లగొండ–ఖమ్మం–వరంగల్ ఎమ్మెల్సీ స్థానం నుంచి గడల శ్రీనివాసరావు ఆ పార్టీ నుంచి పోటీ పడబోతున్నారు. అయితే రెండు ఎమ్మెల్సీ సీట్లు కాబట్టి జనసేన బీజేపీల మధ్య పొత్తు ఉంటే కనుక ఇరు పక్షాలకు బాగా ఉంటుందని అంటున్నారు. దీని మీద తెలంగాణా రాష్ట్ర బీజేపీ వ్యవహారాల ఇంచార్జ్ సునీల్ బన్సాల్ సమక్షంలో ఆ పార్టీ నాయకుల మధ్య చర్చ సాగింది అని అంటున్నారు. అయితే ప్రత్యక్షంగా బీజేపీ జనసేన మద్దతు తీసుకోవడం కానీ ఇవ్వడం కానీ జరిగితే అది మేలు కాదని కమలం పార్టీ నేతలు కలవరం చెందుతున్నారని అంటున్నారు. జనసేన బీజేపీ కలసి బహిరంగ పొత్తు పెట్టుకుంటే కచ్చితంగా బీఆర్ఎస్ టార్గెట్ చేస్తుందని తెలంగాణా నాయకులు ఆందోళన చెందుతున్నారని అంటున్నారు. ఇది చాలా సెన్సిటివ్ ఇష్యూగా మారుతుందని కూడా బీజేపీ నేతలు చెబుతున్నారు. బీజేపీని కూడా తెలంగాణాలో వ్యతిరేకిగా ప్రచారం చేస్తారు అని కూడా వారు బీజేపీ పెద్దలకు చెప్పుకొచ్చారని అంటున్నారు. నిజానికి చూస్తే జనసేన నుంచి ఒక మంచి ప్రతిపాదన వచ్చిందని అంటున్నారు. నల్లగొండ–ఖమ్మం–వరంగల్ ఎమ్మెల్సీ స్థానం నుంచి జనసేన తరఫున పోటీ చేస్తున్న గడల శ్రీనివాసరావుకి బీజేపీ మద్దతు ఇస్తే బీజేపీ పోటీ చేసే రెండవ ఎమ్మెల్సీ సీటు అయిన మహబూబ్‌నగర్ – రంగారెడ్డి – హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గంలో జనసేన మద్దతు ఇస్తుంది అన్నది ఈ ప్రతిపాదన. ఇలా పొత్తు పెట్టుకుని చెరో సీటు తీసుకుని పోటీ చేస్తే రెండు పార్టీలకు ఉపయోగం అని అంటున్నారు. అయితే ఈ విషయంలో అయితే తెలంగాణా బీజేపీ నాయకులు అయితే అంత సుముఖంగా లేరని అంటున్నారు. అంతే కాదు తెలంగాణాకు వచ్చేసరికి బీజేపీకే బలం ఎక్కువ అని వారు పార్టీ పెద్దలకు వివరించినట్లుగా చెబుతున్నారు. జనసేనకు గత ఎన్నికల్లో పోటీ చేస్తే పెద్దగా ఓట్లు రాలేదని కూడా వారు వివరించారని చెబుతున్నారు. అయితే ఏపీలో పొత్తులో ఉంటూ కేంద్రంలో పొత్తు పెట్టుకుని అధికారంలో ఉంటూ తెలంగాణాలో జనసేనతో పొత్తుకు బీజేపీ ఎందుకు భయపడుతోంది అన్నదే డిస్కషన్ పాయింట్. పవన్ చరిష్మా బీజేపీ క్యాడర్ బేస్ రెండూ కలిస్తే తెలంగాణాలో బలమైన కూటమిగా మారవచ్చు అన్నది కూడా వినిపిస్తున్న మాట. మరి చూడాలి ఏమి జరుగుతుందో.

పులివెందులలో కూటమి అభ్యర్థుల ప్రభంజనం.. జగన్ కంచుకోట బద్దలు

మండలంలోని ఐదు ఎంపీటీసీ స్థానాల్లో తెదేపా అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. వేముల మండలంలోని 8 ఎంపీటీసీ స్థానాల్లో తెదేపా అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చక్రాయపేట మండలంలోని 9 ఎంపీటీసీల్లోనూ తెదేపా అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. తొండూరు మండలంలోని 8 ఎంపీటీసీ స్థానాల్లోనూ తెదేపా అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సింహాద్రిపురం మండలంలోని 8 ఎంపీటీసీ స్థానాల్లోనూ తెదేపా అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు.

ప్రాణ, ఆస్తి నష్టాన్ని వీలైనంతగా తగ్గించడమే లక్ష్యం

హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతినే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. తీరప్రాంత గ్రామాల ప్రజలు తుపాను షెల్టర్లకు వెళ్లాలని, నీటి ప్రవాహాల వైపు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్‌తోపాటు నౌకాదళం, కోస్టుగార్డులను అప్రమత్తం చేశామని, హుద్‌హుద్‌తో పోలిస్తే ఈ తుపాను తీవ్రత తక్కువగా ఉండొచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు.

ప్రతి గంటకూ తుపాను హెచ్చరికల బులెటిన్ విడుదల

ఆర్నబ్ తుపాను ముప్పు పొంచి ఉన్న ప్రాంతాల్లో భారీ వర్షాలు, బలమైన గాలులతో తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. ఎన్నికల పనుల్లో బిజీగా ఉన్నప్పటికీ తుపాను సన్నద్ధతపై నిరంతరం సమీక్షిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉందని తెలిపారు. పశ్చిమగోదావరి, కృష్ణా నుంచి శ్రీకాకుళం వరకు వర్షాలు, గాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, కాకినాడ సమీపంలోని యానాం వద్ద తుపాను తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించారు. కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి, మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ ప్రాంతాల్లో నష్టం తీవ్రత అధికంగా ఉండొచ్చని, కొన్ని చోట్ల అతిభారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. శ్రీకాకుళంలో 30 సెంటీమీటర్లు, పశ్చిమగోదావరిలో 28, విశాఖపట్నంలో 23 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, చాలా ప్రాంతాల్లో 10 సెంటీమీటర్లకు పైగా వర్షాలు కురుస్తాయని వివరించారు. తీరప్రాంత జిల్లాల్లో సముద్రపు నీరు లోతట్టు ప్రాంతాల్లోకి చొచ్చుకొచ్చే ప్రమాదం ఉన్నందున తీర గ్రామాలు, లంకలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు తుపాను షెల్టర్లకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే 290 శిబిరాలు ఏర్పాటు చేసి 84,396 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వెల్లడించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు 24 గంటలూ పనిచేస్తున్నాయని, ప్రతి గంటకూ తుపాను హెచ్చరికల బులెటిన్ విడుదల చేస్తూ పరిస్థితిని సమీక్షిస్తున్నామని చంద్రబాబు తెలిపారు.

భయపడొద్దు.. తిరగబడండి

చేశారు. "మా టైమ్ వచ్చినప్పుడు, చట్టాన్ని అతిక్రమించి అన్యాయం చేసిన ఏ అధికారినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. వారు సర్వీసులో ఉన్నా, ఒకవేళ రిటైర్ అయిపోయినా సరే.. ఎక్కడున్నా తీసుకొచ్చి చట్టం ముందు నిలబెట్టి చర్యలు తీసుకుంటాం. వడ్డీతో సహా చెల్లించేలా చేస్తాం" అని తీవ్రంగా హెచ్చరించారు. పులివెందులలో తమ కార్యకర్తలపై చేయి వేస్తే, తనపై చేయి వేసినట్లేనని ఆయన స్పష్టం చేశారు. "మన హక్కులు మనమే కాపాడుకోవాలి. తిరగబడండి" అని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో అధికార కూటమి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. "ఎన్నికల్లో 50 శాతం సీట్లలో పోటీ చేస్తున్నది మా అక్కచెల్లెమ్మలే. వారి నామినేషన్లను నడిరోడ్డుపై అడ్డుకుంటున్నారు. అక్కచెల్లెమ్మల చీరలు చించి దాడులు చేశారు. ఇలా చేయడానికి మీకు సిగ్గుందా? వైసీపీ హయాంలోనే మహిళలకు నిజమైన న్యాయం జరిగింది. ఇప్పుడు చంద్రబాబు చేస్తున్న పనులకు ఆయనే సిగ్గుతో తలదించుకోవాలి" అని మండిపడ్డారు. నామినేషన్ల ప్రక్రియలో అడుగడుగునా అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించారు. "కూటమి నేతలే 17 మున్సిపాలిటీలు ఏకగ్రీవమని ప్రకటించుకున్నారు. నా సొంత నియోజకవర్గమైన పులివెందులలోనే కేవలం 20 వార్డుల్లో నామినేషన్లు వేయగలిగాం. 7 జడ్పీటీసీ స్థానాలకు గాను 4 చోట్ల మాత్రమే పోటీ జరుగుతోంది. స్క్రూటినీ పేరిట 2 మండలాల్లో మా నామినేషన్లను అన్యాయంగా తిరస్కరించారు" అని దుయ్యబట్టారు. కార్యకర్తలంతా ధైర్యంగా ఉండాలని, వారికి తాను అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ రోజున తాను స్వయంగా పులివెందులలోనే ఉంటానని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలుపు ఖాయమని అన్నారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని... మీ అన్న మీకు తోడుగా ఉంటాడని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

చెంబరంబాక్కం రిజర్వాయర్‌కు సీఎం విజయ్..

2015 పునరావృతం కాకూడదని హెచ్చరిక!

ముంపునకు తావివ్వకుండా నీటిని దశలవారీగా నియంత్రిత పద్ధతిలో విడుదల చేయాలని సూచించారు. నీటిని విడుదల చేసే ముందు ప్రజలకు సమాచారం ఇవ్వడంతో పాటు, పోలీసు, రెవెన్యూ, చెన్నై నగర పాలక సంస్థలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. 2015లో భారీ వర్షాల సమయంలో చెంబరంబాక్కం నుంచి అకస్మాత్తుగా నీటిని విడుదల చేయడం వల్లే చెన్నై నగరం ఘోర విపత్తును చవిచూసిందన్న విమర్శలున్నాయి. ఆ ఘటనలో 400 మందికి పైగా మరణించగా, లక్షలాది ఇళ్లు నీట మునిగాయి. ఈ నేపథ్యంలో సీఎం విజయ్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ విషయంపై 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) ప్రతినిధి ఎం.సత్యకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. "2015లో నాటి ముఖ్యమంత్రి జయలలిత అనుమతి కోసం అధికారులు ఆలస్యం చేయడం వల్లే విపత్తు సంభవించింది. అలాంటిది మళ్లీ జరగకూడదు. ముఖ్యమంత్రే స్వయంగా రిజర్వాయర్‌కు రావడం అధికారులకు బలమైన సందేశం. మాకు అధికారులపై నమ్మకం లేదు, ఆటలు ఆడవద్దని హెచ్చరిస్తున్నాం" అని ఆయన అన్నారు.

ఆర్నబ్ తుపాన్ పై ఏపీ ప్రభుత్వం అప్రమత్తం..

హోంమంత్రి అనిత కీలక సూచనలు

అప్రమత్తం చేసి, ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు భారీ స్థాయిలో సహాయక చర్యలను ప్రారంభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిన్న ఉన్నతాధికారులు, కలెక్టర్లతో సమీక్ష నిర్వహించి, జీరో క్యాజువాలిటీ లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. తీర ప్రాంత జిల్లాల్లో 15 ఎన్డీఆర్ఎఫ్, 8 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను మోహరించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న సుమారు 89,000 మందిని గుర్తించి, 101 పునరావాస కేంద్రాలకు తరలించే ప్రక్రియను వేగవంతం చేశారు. ముందుజాగ్రత్త చర్యగా కాకినాడ తీరంలోని హోప్ ఐలాండ్‌ను పూర్తిగా ఖాళీ చేయించారు. ప్రభుత్వం పూర్తిగా అప్రమత్తంగా ఉందని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ప్రజల ప్రాణాలను కాపాడటమే తమ ప్రథమ ప్రాధాన్యత అని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఆమె భరోసా ఇచ్చారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ప్రయాణాలు చేయవద్దని, సముద్ర తీరాలకు దూరంగా ఉండాలని సూచించారు.

బ్రహ్మపుత్రపై డ్యాం ప్రమాదకరం..

చైనాకు నిపుణుల హెచ్చరిక

కోట్ల డాలర్ల అంచనా వ్యయంతో నిర్మించే ఈ డ్యాంవల్ల టిబెట్‌లోని బ్రహ్మపుత్ర నదిలో నీటి ప్రవాహం భారీగా పెరిగిపోయి, తీవ్రమైన వరద ముప్పు వాటిల్లవచ్చని స్వయంగా చైనా నిపుణులే హెచ్చరిస్తున్నారు. ఈ డ్యాం పూర్తయితే 60,000 మెగావాట్ల కంటే ఎక్కువ స్థాపిత సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద జల విద్యుత్ కేంద్రమైన చైనాకు చెందిన త్రీ గోర్జెస్ డ్యాం ప్రాజెక్టు సామర్థ్యం కంటే దాదాపు 3 రెట్లు ఎక్కువ. ఈ ఏడాది ఆగస్టు 26న చైనా–నేపాల్ సరిహద్దులో మంచు–రాతి హిమపాతం సంభవించి దిగువన నదికి వరద వచ్చింది. ఈ ఆకస్మిక వరదలవల్ల నేపాల్, టిబెట్‌లలో దాదాపు 1,500 మంది మరణించారు. 5,500 మందికిపైగా గల్లంతయ్యారు. చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, యున్నాన్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు 1325 నుంచి 2020 వరకూ ఆగ్నేయ టిబెటన్ పీఠభూమిలోని చెట్ల వలయాల వెడల్పును పరిశీలించడంద్వారా బ్రహ్మపుత్ర నది నీటి ప్రవాహ చరిత్రను పునర్నిర్వచించారు. ఇప్పటికే భూతాపంవల్ల టిబెటన్ పీఠభూమి ప్రపంచ సగటు కంటే దాదాపు రెట్టింపు వేగంతో వేడెక్కుతోంది. ఇది అక్కడ మంచు పొరను వేగంగా కరిగించేస్తూ.. జలచక్రాన్ని ప్రభావితం చేస్తోందని చైనా పరిశోధకులు వెల్లడించారు. బ్రహ్మపుత్ర ప్రవాహంలో ఆకస్మికంగా వచ్చే హెచ్చు తగ్గులు దక్షిణాసియాలో (భారత్, బంగ్లాదేశ్‌లలో) కరవు, వరదలకు దారితీయవచ్చని వారు హెచ్చరించారు. ఈ ప్రతిపాదిత డ్యాం కిందనే చురుకైన భూగర్భ పగులు రేఖ ఉందని, దానివల్ల భూకంపం ఏర్పడితే ప్రాజెక్టు స్థిరత్వానికి ముప్పు వాటిల్లవచ్చని చైనా శాస్త్రవేత్తలు తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

'అర్నబ్' ఎఫెక్ట్.. ఉత్తరాంధ్రలో పూర్తిగా మారిన వాతావరణం

అమరావతి, సిటిజన్ టైమ్స్

పశ్చిమమధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్నబ్' అతి తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు వేగంగా దూసుకొస్తోంది. గడిచిన 6 గంటల్లో గంటకు 20 కిలోమీటర్ల వేగంతో కదులుతున్న ఈ తుపాను, ప్రస్తుతం విశాఖపట్నానికి 170 కి.మీ., కాకినాడకు 180 కి.మీ., మచిలీపట్నానికి 270 కి.మీ., బాపట్లకు 350 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తా జిల్లాల్లో వాతావరణం పూర్తిగా మారిపోయింది. 'అర్నబ్' ప్రభావంతో ఇప్పటికే శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, విశాఖ, అనకాపల్లి, కోనసీమ జిల్లాల్లో వర్షాలు ప్రారంభమయ్యాయి. ఈరోజు సాయంత్రం నుంచి పోలవరం, కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. తుపాను రేపు (బుధవారం) ఉదయానికి బాపట్ల–విశాఖపట్నం మధ్య, యానాంకు సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 125 నుంచి 135 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ, "తుపాను తీరం దాటే సమయంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలి" అని సూచించారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. అధికార యంత్రాంగం సహాయక చర్యల కోసం సర్వసన్నద్ధంగా ఉంది.

స్థానిక ఎన్నికలపై పవన్ కీలక వ్యాఖ్యలు.. రెబల్స్‌కు స్పష్టమైన హెచ్చరిక జారీ

అమరావతి, సిటిజన్ టైమ్స్

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పొత్తులో భాగంగా పార్టీ అధికారికంగా బీఫామ్ జారీ చేసినవారే కూటమి అభ్యర్థులని, నామినేషన్లు వేసిన ఇతరులు వాటిని ఉపసంహరించుకోవాలని ఆయన స్పష్టం చేశారు. కూటమి స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. సీట్ల సర్దుబాటు ప్రక్రియ ఒక సవాల్ లాంటిదని, ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో దీనిని విజయవంతంగా పూర్తి చేశామని పవన్ తెలిపారు. అందరం కలిసి కూర్చుని చర్చించి అభ్యర్థుల జాబితాను ఖరారు చేశామన్నారు. కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పార్టీ కోసం త్యాగాలు చేసిన వారికి భవిష్యత్తులో తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రదర్శించిన ఐక్యతను మరోసారి స్థానిక ఎన్నికల్లోనూ చూపాలని నేతలకు పిలుపునిచ్చారు. సీట్ల సర్దుబాటు చర్చల సమయంలోనే ఆర్నబ్ తుపాన్ వచ్చిందని, అంతటి క్లిష్ట పరిస్థితుల్లోనూ సీఎం చంద్రబాబు తుపాన్‌పై సమీక్షలు నిర్వహించి యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారని పవన్ గుర్తుచేశారు. సంక్షోభ సమయంలో ఆయన పనితీరు అందరికీ ఆదర్శమన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడంలో ప్రభుత్వం ఛాలెంజింగ్‌గా పనిచేస్తోందని, దేశానికి వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయని చెప్పారు. అడవితల్లి బాట కింద రూ.3,458 కోట్లతో 3,638 కిలోమీటర్ల రోడ్లు నిర్మించామని, పంచాయతీరాజ్ శాఖలో రూ.1.5 లక్షల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు.

దిల్లీకి 10 లక్షల మంది నిరసనకారులా.. వ్యాపారం చేసేదెలా?: రాహుల్‌కు సీటీఐ లేఖ

రాహుల్ గాంధీకి 'ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ' మరోసారి లేఖ రాసింది. పది లక్షల మంది నిరసనకారులు దిల్లీకి వస్తే.. వ్యాపారం ఎలా చేసుకోవాలని ప్రశ్నించింది. దీపావళి పండగ సీజన్‌లో ర్యాలీ నిర్వహించడం వల్ల రామ్‌లీలా మైదానం పరిసరాల్లో దాదాపు రూ.10 వేల కోట్ల వ్యాపారంపై ప్రభావం పడొచ్చని పేర్కొంది. ర్యాలీని నవంబర్ 10కి వాయిదా వేయాలని విజ్ఞప్తి చేసింది. లేదంటే వాణిజ్య ప్రాంతాలకు దూరంగా నిరసన ప్రదేశాన్ని మార్చాలని లేఖలో కోరింది. ఈ లేఖ ప్రతిని రాహుల్‌తో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు కూడా పంపామని.. దీనిపై ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో చర్చించాలని కోరామని సీటీఐ ఛైర్మన్ బ్రిజేశ్ గోయల్ తెలిపారు. అక్టోబర్ 31, నవంబర్ 1 తేదీల్లో రామ్‌లీలా ప్రాంతంలో బారికేడ్లు ఏర్పాటు చేయడం, రోడ్లను మూసివేయడం వంటి చర్యల వల్ల వినియోగదారులు దుకాణాలకు వచ్చే అవకాశం ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇరుకైన దిల్లీ వీధుల్లోకి లక్షలమంది నిరసనకారులు, 20వేల వాహనాలు రావడం వల్ల వ్యాపారం జరగదన్నారు. అక్టోబర్ 10న జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనల్లో సుమారు 4 వేల మంది పాల్గొనడం వల్ల దిల్లీ అంతటా రాకపోకలకు అంతరాయం కలిగిందని తెలిపారు. దీనివల్ల వ్యాపారులకు రూ.3 వేల కోట్ల నష్టం వాటిల్లిందని వెల్లడించారు.

కొత్త 1000 నోటు మళ్లీ వస్తోందా? కేంద్రం ఏమందంటే?

చేసింది. అలాంటి అవాస్తవాలను నమ్మొద్దని కోరింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎలాంటి రూ.1000 నోటూ జారీ చేయలేదని స్పష్టం చేస్తూ పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టింది. పసుపు రంగులో ఉండి, ఆలయం ఫొటో ఉన్న రూ.1000 నోటు కొత్తగా జారీచేశారని, 15వ తేదీ నుంచి చలామణిలోకి రానుందంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. ఈ వీడియోలు వైరల్‌గా మారడంతో కేంద్రం స్పందించింది. అధికారిక వర్గాల ద్వారా వచ్చే సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని సూచించింది. 2016 నవంబర్ 8న పెద్ద నోట్లు రద్దు చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో రూ.1000, రూ.500 నోట్లను రద్దు చేశారు. ఆ తర్వాత రూ.2 వేల నోట్లను, రూ.500 నోట్ల కొత్త సిరీస్‌లో పరిచయం చేశారు. ఆ తర్వాత రూ.2 వేల నోట్లనూ కేంద్రం ఉపసంహరించుకుంది. ప్రస్తుతం భారత్‌లో రూ.10, రూ.20, రూ.50, రూ.100, రూ.200, రూ.500 నోట్లు మాత్రమే అధికారికంగా చలామణిలో ఉన్నాయి.

తుఫాన్ ప్రభావంతో పంటలకు నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

రైతులకు మండల వ్యవసాయ అధికారి మళ్ల నారాయణరావు సూచన

బుచ్చయ్యపేట, అక్టోబర్ 27 (సిటిజన్ టైమ్స్):
ఆర్నాబ్ తుఫాన్ నేపథ్యంలో రైతులు పంటల రక్షణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని బుచ్చయ్యపేట మండల వ్యవసాయ అధికారి మళ్ల నారాయణరావు సూచించారు. మండలంలో కురుస్తున్న వర్షాల కారణంగా వరి పొలాల్లో చేరిన అదనపు నీటిని కాలువల ద్వారా బయటకు పంపించాలని కోరారు. రానున్న రోజుల్లో వర్షాలు, ఈదురుగాలులు పెరిగే అవకాశం ఉన్నందున మొక్కజొన్న, చెరకు పంటలు పడిపోకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. పంటలకు నష్టం వాటిల్లితే రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి సూచనలు పొందాలని తెలిపారు. రైతుల సహాయం కోసం మండలంలో 8331056408 నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటారని వెల్లడించారు.

జీవీఎంసీ ఎన్నికల్లో మద్దతు కోరిన వరుదు కళ్యాణి

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 27
జీవీఎంసీ మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, శాసన మండలి సభ్యురాలు వరుదు కళ్యాణి విశాఖపట్నం జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఛాంబర్‌లో న్యాయవాదులతో సమావేశమైన ఆమె, రానున్న జీవీఎంసీ ఎన్నికల్లో తనకు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతు తెలిపి విజయానికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా వరుదు కళ్యాణి మాట్లాడుతూ నగర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, మౌలిక సదుపాయాల మెరుగుదలే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ పనిచేస్తోందని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయవాదుల పాత్ర కీలకమని, న్యాయ పరిరక్షణతో పాటు ప్రజల్లో చైతన్యం కల్పించడంలో వారు విశేష సేవలు అందిస్తున్నారని అన్నారు. నగర అభివృద్ధిలో అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యం అవసరమని పేర్కొంటూ, ఎన్నికల్లో మద్దతు అందించాలని బార్ అసోసియేషన్ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో న్యాయవాదులతో ఆమె ఆత్మీయంగా ముచ్చటించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు కృష్ణమోహన్, బాజీ నాయుడు, బీవీఆర్ మూర్తి, సన్నీ, రవిరాజ్, బార్ కౌన్సిల్ సభ్యులు, మాజీ ప్రభుత్వ న్యాయవాదులు, పలువురు స్థానిక న్యాయవాదులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు అండగా ప్రియాంక దండి బృందం

అధికారులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 27:
ఆర్నబ్ తుపాను నేపథ్యంలో ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తన బృందం సిద్ధంగా ఉందని కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రియాంక దండి తెలిపారు. తుపాను ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా తన సిబ్బంది, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, తమతో కలిసి పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అందుబాటులో ఉంటారని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలుస్తూ, అవసరమైన సహాయక చర్యల్లో భాగస్వాములవుతామని పేర్కొన్నారు. తుపాను సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సహాయం అవసరమైన వారు 6305821260 నంబర్‌ను సంప్రదించాలని ప్రియాంక దండి విజ్ఞప్తి చేశారు.

తుఫాన్ వేళ అప్రమత్తంగా జీవీఎంసీ..

ప్రజల భద్రతకు పెద్దపీట!

కొండవాలు, లోతట్టు ప్రాంతాల్లో కమిషనర్ కేతన్ గార్గ్ పర్యటన.. సిటీ ఆపరేషన్స్ సెంటర్‌లో పరిస్థితుల సమీక్ష

విశాఖపట్నం, అక్టోబర్ 27 (సిటిజన్ టైమ్స్)
ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి తుఫాన్ ప్రభావంతో నగరంలో భారీ వర్షాలు, ఈదురుగాలులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వెస్ట్, నార్త్ జోన్లలో పర్యటించిన ఆయన కొండవాలు, లోతట్టు ప్రాంతాల పరిస్థితులను పరిశీలించారు. నార్త్ జోన్‌లోని 57వ వార్డు ఇందిరానగర్--1లో మట్టి పెళ్లలు జారిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రమాదకర ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని కోరారు.

సిటీ ఆపరేషన్స్ సెంటర్ ద్వారా నిరంతర పర్యవేక్షణ
అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సిటీ ఆపరేషన్స్ సెంటర్‌ను సందర్శించి నగరంలోని వర్షపరిస్థితులపై అధికారులతో సమీక్షించారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగులు కూలిపోవడం,

కాలువలు పొంగిపొర్లడం వంటి ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని జోన్ల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని స్పష్టం చేశారు. అత్యవసర సమస్యల

పరిష్కారం కోసం జీవీఎంసీ టోల్‌ఫ్రీ నంబర్ 1800 4250 0009, వాట్సాప్ నంబర్ 90142 18870 ద్వారా ప్రజలు ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగించాలని కమిషనర్ ఆదేశించారు.

అక్రమ మద్యం విక్రయాలపై పోలీసుల ఉక్కుపాదం

82 మద్యం బాటిళ్లు స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్

ఎన్నికల వేళ అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు: వన్ టౌన్ సీఐ పూడి వరప్రసాద్

విశాఖపట్నం, అక్టోబర్ 27 (సిటిజన్ టైమ్స్)
విశాఖ నగరంలో అక్రమ మద్యం విక్రయాలపై పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు చేపట్టిన తనిఖీల్లో భాగంగా వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కురుపం మార్కెట్ సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 82 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కురుపం మార్కెట్ ప్రాంతంలో అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారంతో వన్ టౌన్ సీఐ పూడి వరప్రసాద్ ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులపై ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐ పూడి వరప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి అక్రమ కార్యకలాపాలను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనుమతులు లేకుండా మద్యం నిల్వ చేసినా, విక్రయించినా, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మద్యం లేదా విలువైన వస్తువులను పంపిణీ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా నిరంతర నిఘా కొనసాగిస్తామని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తామని సీఐ వరప్రసాద్ హెచ్చరించారు.

కూటమి రెబల్స్‌ను సస్పెండ్ చేయాలి!

మూడు పార్టీల నాయకత్వానికి కార్పొరేటర్ అభ్యర్థుల విజ్ఞప్తి

విశాఖపట్నం, అక్టోబర్ 27 (సిటిజన్ టైమ్స్)
కూటమి పార్టీల నుంచి రెబల్స్‌గా బరిలో నిలిచిన స్వతంత్ర అభ్యర్థులను వెంటనే సస్పెండ్ చేయాలని కార్పొరేటర్ అభ్యర్థులు మూడు పార్టీల నాయకత్వాన్ని కోరారు. గాజువాకలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కూటమి కార్పొరేటర్ అభ్యర్థుల పరిచయ సమావేశంలో ఈ అంశం ప్రధానంగా ప్రస్తావనకు వచ్చింది. ఈ సమావేశానికి విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, విశాఖ మేయర్ అభ్యర్థిని డాక్టర్ ముక్కా శ్రావణి, బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్, గాజువాక ఇన్‌ఛార్జి కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్), జనసేన గాజువాక ఇన్‌ఛార్జి, డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థులు మాట్లాడుతూ, భాగస్వామ్య పార్టీలకు చెందిన కొందరు నాయకులు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయడం పార్టీ నిర్ణయాలకు విరుద్ధమని అభిప్రాయపడ్డారు. కూటమి అభ్యర్థుల విజయానికి ఆటంకం కలగకుండా రెబల్ అభ్యర్థులపై ఆయా పార్టీల నాయకత్వాలు క్రమశిక్షణ

చర్యలు తీసుకోవాలని, వారిని వెంటనే సస్పెండ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి అన్ని స్థానాల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రెబల్ అభ్యర్థుల అంశంపై మూడు పార్టీల నాయకత్వాలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటాయన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఆర్నాబ్ తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

ప్రాణనష్టం నివారణకు ముందస్తు చర్యలు: కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, అక్టోబర్ 27 (సిటిజన్ టైమ్స్)
ఆర్నాబ్ తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రాణనష్టం జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో, జిల్లాలోని ఆరు తీరప్రాంత మండలాల్లో వర్షాలు, ఈదురుగాలుల తీవ్రత పెరుగుతోందని తెలిపారు. ప్రస్తుతం గంటకు 15 కిలోమీటర్ల వేగంతో వీస్తున్న గాలులు సాయంత్రానికి 60 నుంచి 70 కిలోమీటర్లకు పెరిగే అవకాశం ఉందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు బయటకు రావద్దని, ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని కోరారు. తుఫాన్ సహాయక చర్యల కోసం జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడం వంటి అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్లు 08924-222888, 08924-225999, 08924-226599కు సమాచారం అందించాలని సూచించారు. రెవెన్యూ డివిజన్ కంట్రోల్ రూమ్‌లలో నర్సీపట్నం 08932-224420, అనకాపల్లి 08924-223316, అడ్డురోడ్డు 08931-293606 నంబర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యుత్ సమస్యల కోసం కశింకోట 8333810597, అనకాపల్లి 9063110544, నర్సీపట్నం 9491030714 నంబర్లను సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

తుపాను వేళ విద్యుత్ షాక్‌తో వృద్ధుడి మృతి

దువ్వాడ మంగళపాలెంలో విషాదం..

నీటిలో తెగిపడిన విద్యుత్ వైర్లు

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 27
తుపాను ప్రభావంతో తెగిపడిన విద్యుత్ వైర్లు నీటిలో ఉండటంతో విద్యుత్ షాక్‌కు గురై ఓ వృద్ధుడు మృతి చెందిన విషాద ఘటన దువ్వాడ పరిధిలోని మంగళపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. అమర పిన్ని దేవుడు (65) ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. తెగిపడిన విద్యుత్ వైర్లు నీటిలో ఉన్న విషయాన్ని గుర్తించకపోవడంతో వృద్ధుడు విద్యుత్ షాక్‌కు గురైనట్లు తెలిసింది. సమాచారం అందుకున్న దువ్వాడ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేజీహెచ్‌కు తరలించారు. తుపాను, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నీటిలో తెగిపడిన విద్యుత్ వైర్లు కనిపిస్తే వాటికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితులు ఎదురైతే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరుతున్నారు.

వమ్మివరం పునరావాస కేంద్రంలో తుఫాను బాధితులకు కలెక్టర్ భరోసా

అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 27
తుఫాను నేపథ్యంలో అనకాపల్లి జిల్లా ఎస్. రాయవరం మండలం వమ్మివరం గ్రామంలోని పునరావాస కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సందర్శించారు. కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న బాధితులను పరామర్శించి, వారి సమస్యలు, క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. పునరావాస కేంద్రంలో బాధితులకు అందుతున్న ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. తుఫాను ప్రభావం తగ్గే వరకు ప్రజలు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం, అధికార యంత్రాంగం అన్ని విధాలా అండగా ఉంటుందని కలెక్టర్ భరోసా ఇచ్చారు. పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న వారికి అంటువ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, గర్భిణులు, వృద్ధుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. తుఫాను పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి చేరుకునే వరకు అప్రమత్తంగా ఉండి, బాధితులకు నిరంతరం అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌తో పాటు సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తుపాను ముప్పు.. విశాఖ జిల్లా యంత్రాంగం అప్రమత్తం

29వ తేదీ వరకు భారీ వర్షాలు.. గంటకు 90 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 27:

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన పరిస్థితుల నేపథ్యంలో ఈ నెల 29వ తేదీ వరకు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 90 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలు ఉన్న నేపథ్యంలో ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పోలీస్, జీవీఎంసీ, రెవెన్యూ, విద్యుత్, వైద్య ఆరోగ్య, రవాణా, పంచాయతీరాజ్, జలవనరులు తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొండ ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు, ముంపు ప్రభావిత గ్రామాల్లో ప్రమాదకర పరిస్థితులను ముందుగానే గుర్తించి, అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా రహదారులపై చెట్లు కూలితే వెంటనే తొలగించేందుకు జేసీబీలు, ఇతర యంత్రాలను సిద్ధంగా ఉంచాలని, విద్యుత్ అంతరాయాలను నివారించేందుకు అవసరమైన సిబ్బంది, పరికరాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. వైద్య బృందాలు, అత్యవసర మందులు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా అప్రమత్తం చేయాలని, పడవలు, వలలను సురక్షిత ప్రాంతాల్లో ఉంచేలా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులకు సూచించారు. కలెక్టరేట్, జీవీఎంసీ కార్యాలయాలతో పాటు క్షేత్రస్థాయిలో 24 గంటల పాటు పనిచేసే కమాండ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ప్రధాన కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని, ముందుగా మంజూరైన సెలవులను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు అనుమతి లేకుండా సెలవులు మంజూరు చేయరాదని స్పష్టం చేశారు. ప్రజలకు ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా రక్షణ, సహాయక, పునరావాస చర్యలు సమర్థవంతంగా చేపట్టాలని అధికారులకు జారీ చేసిన ప్రత్యేక ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అత్యవసర సహాయం కోసం సంప్రదించాల్సిన నంబర్లు: జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌లు: 0891-2590100, 0891-2590102; జీవీఎంసీ: 1800 4250 0009; ఈపీడీసీఎల్: 1912; అత్యవసర హెల్ప్‌లైన్: 112.

హింసా మార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలోకి ముగ్గురు మావోయిస్టులు

జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి ఎదుట ఏసీఎం స్థాయి సభ్యుల లొంగుబాటు

పోలవరం జిల్లా, అక్టోబర్ 27 (సిటిజన్ టైమ్స్)

హింసాత్మక మార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలోకి రావాలనే నిర్ణయంతో ముగ్గురు మావోయిస్టులు పోలవరం జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి ఎదుట లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మాడవి కోయింగ్, హేమల హెడ్మా, కొవ్వాసి జోగి అనే ముగ్గురు ఏసీఎం స్థాయి మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు అధికారులు వెల్లడించారు. హింసాత్మక సిద్ధాంతాలపై విరక్తి, కుల వివక్ష, ప్రాణభయం వంటి కారణాలతో మావోయిస్టు కార్యకలాపాలకు దూరమై సాధారణ జీవితం గడపాలని నిర్ణయించుకున్నట్లు లొంగిపోయిన వారు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. గతంలో పలు ఎన్‌కౌంటర్లలో వీరు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. హింసకు దూరంగా ఉండి సమాజంలో ప్రశాంతమైన జీవితం గడపాలని నిర్ణయించుకున్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పునరావాస ప్రయోజనాలు, సంక్షేమ పథకాలు అందిస్తామని స్పష్టం చేశారు. హింసాత్మక కార్యకలాపాలను వీడి జనజీవన స్రవంతిలోకి రావాలనుకునే వారు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

వర్షంలోనూ వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం

17వ వార్డులో పినిపే విశ్వరూప్, పినిపే శ్రీకాంత్ పర్యటన

అమలాపురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 27

అర్నాబ్ తుపాను ప్రభావంతో వర్షం కురుస్తున్నప్పటికీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. అమలాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ మంత్రి, అమలాపురం పార్లమెంట్ కో-ఆర్డినేటర్ పినిపే విశ్వరూప్, అసెంబ్లీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ మంగళవారం పట్టణంలోని 17వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ 17వ వార్డు అభ్యర్థి నాగారపు వెంకటేశ్వరరావును, చైర్‌పర్సన్ అభ్యర్థి దూడల సవితాదేవిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గడపగడపకు వెళ్లి స్థానికులను కలుసుకుంటూ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఓట్లు అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, అమలాపురం ఎన్నికల పరిశీలకుడు కటకంశెట్టి ఆదిత్య, పట్టణ అధ్యక్షుడు సంసాని నాని, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

గంభీరం రిజర్వాయర్ పరిసర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దు.. ఆనందపురం సీఐ ఎర్రం నాయుడు సూచన

ఆనందపురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 27:

ఆర్నబ్ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఆనందపురం మండల ప్రజలు, ముఖ్యంగా గంభీరం రిజర్వాయర్ పరిసర ప్రాంతాల ప్రజలు, మత్స్యకారులు, బోనీ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆనందపురం పోలీస్ స్టేషన్ సీఐ వై.వి.వి.సి.ఎం. ఎర్రం నాయుడు సూచించారు. విశాఖపట్నం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తుఫాన్ ప్రభావంతో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేని సమయంలో గంభీరం రిజర్వాయర్‌లో చేపల వేటకు వెళ్లరాదని సీఐ సూచించారు. నీటి ప్రవాహం ఉన్న ప్రాంతాలు, రిజర్వాయర్ గట్లు, ఇతర ప్రమాదకర ప్రదేశాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రిజర్వాయర్ నీటిమట్టం పెరిగే అవకాశం ఉన్నందున పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, పాత భవనాల సమీపంలో ఉండరాదని సూచించారు. పిల్లలను రిజర్వాయర్లు, చెరువులు, నీటి కాలువలు, ప్రమాదకర ప్రాంతాల వద్దకు వెళ్లనివ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, అధికారులు జారీ చేసే హెచ్చరికలు, సూచనలను తప్పనిసరిగా పాటించాలని సీఐ యెర్రం నాయుడు కోరారు. అవసరమైనప్పుడు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని, వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతే ప్రధాన లక్ష్యమని, తుఫాన్ పరిస్థితుల దృష్ట్యా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కోనసీమ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి : ఎంపీ హరీష్ బాలయోగి

అమలాపురం సిటిజన్ టైం అక్టోబర్ 27

అర్నాబ్ తుఫాన్ నేపథ్యంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అమలాపురం ఎంపీ లిజి.ఎం. హరీష్ బాలయోగిలి అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. ఇప్పటికే తుఫాన్ ప్రారంభం కావడంతో ప్రభుత్వం మరియు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారన్నారు. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, తీర ప్రాంత ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని సూచించారు. అవసరమైతే క్రింది కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లకు ఫోన్ చేయాలని ఎంపీ సూచించారు. అత్యవసర పరిస్థితిలో కంట్రోల్ రూమ్ ల ఫోన్ నంబర్లు ఫోన్ చేయాలని, జిల్లా కలెక్టరేట్, కోనసీమ - 08856-293104. ఆర్డీఓ కార్యాలయం, అమలాపురం - 08856-233208 ఆర్డీఓ కార్యాలయం,రామ చంద్రపురం -08857-245166, ఆర్డీఓ కార్యాలయం, కొత్తపేట - లి8500238258 ఆర్డీఓ కార్యాలయం, కొత్తపేట - లి08855-244299లి సంప్రదించాలని కోరారు.

కాంగ్రెస్ "ఓట్ బచావ్ - దేశ్ బచావ్" సమావేశం

అమలాపురం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 27

అంబేద్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశం అమలాపురంలో సి డబ్ల్యూ సి మెంబర్ గిడుగు రుద్రరాజు నివాసం వద్ద జరిగింది. "ఓట్ బచావ్ - దేశ్ బచావ్" కార్యక్రమం నిమిత్తం నిర్వహించిన ఈ సమావేశానికి ఏఐసీసీ పరిశీలకులు కిరణ్ ముగ బాసఫ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా రాబోయే మున్సిపల్ ఎన్నికలలో పార్టీ బలోపేతం, ఓటర్ల నమోదులో జరుగుతున్న అక్రమాలపై పోరాటం తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట ఇన్చార్జ్ రౌతు సూర్యప్రకాష్ జిల్లా అధ్యక్షుడు కొత్తూరు శ్రీను, టౌన్ ప్రెసిడెంట్ ఒంటెద్దు బాబి, ముషిణి రామకృష్ణ,, ముషిణి మణి మామిడికుదురు మండల అధ్యక్షుడు అప్పన శ్రీరామకృష్ణ,అంబాజీపేట మండలాధ్యక్షుడు దొమ్మేటి వినోద్ బాబు వడ్డే నాగేశ్వరరావు, బత్తుల సురేష్ బాబు, ఏలేశ్వరం రాధాకృష్ణ, దేవరపల్లి రాజేంద్రబాబు, వానరాసి దుర్గారావు, వానరాసి దొరబాబు, జాలెం సునీత, సీనియర్ కాంగ్రెస్ నాయకులు యార్లగడ్డ రవీంద్ర, మాచవరపు శివన్నారాయణ, వాకపల్లి రాంబాబు ములపర్తి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

తీర ప్రాంతం గచ్చకాయల పోరా సందర్శించిన జిల్లా యంత్రాంగం

సముద్ర తీర ప్రాంత పూరి గుడిసెల్లో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించిన కలెక్టర్

కాట్రేని కోన, సిటిజన్ టైమ్స్: అక్టోబర్ 27

ఆర్నాబ్ తుఫాను ప్రభావం జిల్లాపై అధికంగా ఉండే అవకాశం ఉన్నందున తీర ప్రాంతాల్లో పూరి గుడిసెలు, తాటాకు గుడిసెల్లో నివసించే ప్రజలను గుర్తించి, ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కాట్రేనికోన మండలం గచ్చికాయలపొర గ్రామంలో జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా క్షేత్రస్థాయిలో పర్యటించి, తాటాకు గుడిసెల్లో నివసిస్తున్న ప్రజలకు ఆర్నాబ్ తుఫాను ప్రభావం, దాని తీవ్రత గురించి వివరించారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా ప్రజలు స్వచ్ఛందంగా సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని విజ్ఞప్తి చేశారు.?? గచ్చికాయలపొరలోని పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. పునరావాస కేంద్రాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, ఆహారం, విద్యుత్, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాలను నిరంతరం అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భారత వాతావరణ శాఖ జారీ చేసే సూచనలు, హెచ్చరికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తుఫాను ప్రభావం సుమారు 48 గంటలపాటు జిల్లాపై ఉండే అవకాశం ఉన్నందున అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం కాట్రేనికోన మండలంలో కూనవరం మొగ తీర ప్రాంతంలో జిల్లా కలెక్టర్ పర్యటించి డ్రైనేజీ పూడికతీత పనులను పరిశీలించారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కాలువల్లో నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా పూడికతీత పనులను త్వరితగతిన పూర్తి చేసి, వర్షపు నీరు సజావుగా సముద్రంలోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కాట్రేనికోన ప్రత్యేక అధికారి జి. మమ్మీ, జిల్లా డ్రైన్స్ డీఈ శ్రీనివాస్, కాట్రేనికోన ఎంపీడీవో బి. రాజేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో కమిషనర్ పర్యటన

ముమ్మిడివరం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 27

'అర్నాబ్' తుపాను, భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ పి. రవి వర్మ క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాలు, గుడిసెలు, తాత్కాలిక నివాసాల్లో ఉంటున్న ప్రజలను కలిసి తుపాను ప్రభావంపై అవగాహన కల్పించారు. ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సహాయం కోసం నగర పంచాయతీ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని కమిషనర్ రవి వర్మ కోరారు.

వేములలో టీడీపీ క్లీన్‌స్వీప్.. 8 ఎంపీటీసీ స్థానాలు కైవసం

పులివెందుల, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 27:

వేముల మండలంలో టీడీపీ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. మండలంలోని మొత్తం 8 ఎంపీటీసీ స్థానాలను టీడీపీ కైవసం చేసుకుంది. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, కష్టకాలంలో కార్యకర్తలకు అండగా నిలిచిన పార్థసారథి రెడ్డి కుటుంబానికి ఈ ఫలితాలు మరింత ఉత్సాహాన్నిచ్చాయి. కార్యకర్తల ఐక్యత, నాయకుల కృషి పార్టీ విజయానికి దోహదపడినట్లు టీడీపీ శ్రేణులు పేర్కొంటున్నాయి.

ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి ఆధిపత్యం.. 9 స్థానాలు ఏకగ్రీవం

పులివెందుల, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 27:

లింగాల మండలంలో ఎంపీటీసీ ఎన్నికల్లో తొమ్మిది స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఈ మేరకు మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుహాసిని మంగళవారం వెల్లడించారు. ఏకగ్రీవమైన స్థానాల్లో ఎనిమిది టీడీపీ, ఒకటి బీజేపీ అభ్యర్థి దక్కించుకున్నారు. టీడీపీ తరఫున లింగాల నుంచి నీలమహేశ్వరి, కామసముద్రం నుంచి దేవిరెడ్డి సంజీవరెడ్డి, ఇప్పట్ల నుంచి

పందిళ్లపల్లి మనోహర్‌రెడ్డి, చిన్న కుడాల నుంచి లోమడ స్నేహ, బోనాల నుంచి కొమ్మ జయ రామిరెడ్డి, వెలిదండ్ల నుంచి గొడ్డు మర్రి అనిల్‌కుమార్, పార్నపల్లె నుంచి ముక్కోళ్ల రమేష్, కోమ నూతల నుంచి నాగిరెడ్డిగారి ప్రసన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా బీజేపీ తరఫున మురారిచింతల ఎంపీటీసీ స్థానానికి బుడమకుంట్ల సువర్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సుహాసిని తెలిపారు.

పింఛన్ల పంపిణీకి ఎన్నికల సంఘం అనుమతి

అమరావతి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 27

రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ, ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీకి రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతించింది. దీంతో ఈ నెల 30న లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసేందుకు సెర్ప్ సీఈవో కరుణ ఉత్తర్వులు జారీ చేశారు. పింఛన్ల పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా ఈ నెల 29వ తేదీనే బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసి పంపిణీకి సిద్ధంగా ఉంచాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. నిర్ణీత రోజున అందుబాటులో లేని లబ్ధిదారులకు నవంబర్ 4, 5 తేదీల్లో పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. తేదీలను స్పష్టంగా పేర్కొనండి వార్తను మరింత సంక్షిప్తంగా చేయండి శీర్షికను మరింత ఆకర్షణీయంగా మార్చండి.

పోలీసుల విధులపై విద్యార్థులకు అవగాహన

అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో

భాగంగా కనిగిరిలో ఓపెన్ హౌస్ కార్యక్రమం

కనిగిరి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 28:

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కనిగిరి పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంహెచ్ఆర్ పాఠశాల విద్యార్థులకు పోలీసు శాఖ పనితీరు, వివిధ విభాగాల విధులపై అవగాహన కల్పించారు. పోలీసులు నిర్వహించే విధులు, బాధ్యతలు, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో వారి పాత్రను విద్యార్థులకు వివరించారు. పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాల పనితీరును ప్రత్యక్షంగా చూపిస్తూ, ప్రజల రక్షణ కోసం పోలీసులు చేపట్టే చర్యలను తెలియజేశారు. పోలీసు వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన పెంపొందించడంతో పాటు పోలీసుల సేవలు, త్యాగాల గురించి వివరించారు. ప్రజల భద్రత కోసం విధులు నిర్వహిస్తూ ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల సేవలను స్మరించుకోవడం, విద్యార్థుల్లో పోలీసు శాఖ పట్ల అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కనిగిరి సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై సందీప్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆరెపల్లి గ్రామానికి 9 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో

విద్యుత్ సరఫరాకు మెరుగులు

ధర్మపురి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 27:

ధర్మపురి మండలం ఆరెపల్లి గ్రామంలో విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేందుకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవతో మంజూరైన తొమ్మిది ట్రాన్స్‌ఫార్మర్లను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనబట్ల దినేష్, ధర్మపురి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, గ్రామ సర్పంచ్ మధు పాల్గొని ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో గ్రామంలో విద్యుత్ సరఫరా మెరుగుపడి, ప్రజలతో పాటు రైతులకు ప్రయోజనం చేకూరుతుందని నాయకులు తెలిపారు. గ్రామ అభివృద్ధికి సహకరిస్తూ ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరుకు కృషి చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్నబ్ తుఫాను నేపథ్యంలో ఒక్క ప్రాణనష్టం జరగకూడదు - మంత్రి అచ్చెన్నాయుడు

రైతులు, పంటలు, పశుసంపద రక్షణకు ముందస్తు చర్యలు

మూడు జిల్లాల అధికారులతో టెలికాన్ఫరెన్స్ లో మంత్రి ఆదేశాలు

అమరావతి, సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 27

ఆర్నబ్ తుఫాను నేపథ్యంలో ఒక్క ప్రాణనష్టం కూడా జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులి అధికారులను ఆదేశించారు. మంగళవారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, జాయింట్ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి తుఫాను ముందస్తు ఏర్పాట్లను సమీక్షించారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం అక్టోబర్ 28న యానాం సమీపంలో తుఫాను తీరం దాటే అవకాశం ఉందని, గంటకు 115 నుంచి 125 కి.మీ వేగంతో, గరిష్ఠంగా 140 కి.మీ వరకు గాలులు వీచే ప్రమాదం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తీరప్రాంతాలు, లోతట్టు గ్రామాలు, వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, మూడు జిల్లాల్లో 24 గంటల కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు

కల్పించాలని ఆదేశించారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులకు ప్రత్యేక రక్షణ కల్పించాలని, ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలన్నారు.

రైతులు, పంటల రక్షణకు ప్రాధాన్యత:

కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటలు, కల్లాల్లోని ధాన్యాన్ని సురక్షితంగా భద్రపరచాలని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, గోదాములు అందుబాటులో ఉంచాలన్నారు. వరి, మొక్కజొన్న, పత్తి పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ ఏర్పాట్లు చేయాలని, అరటి, బొప్పాయి, కొబ్బరి, ఆయిల్ పామ్ తోటలకు నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. పశువులను ముంపు ప్రాంతాల నుంచి తరలించి పశుగ్రాసం, మందులు సిద్ధంగా ఉంచాలని, మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, చేపలు, రొయ్యల చెరువుల గట్లను పరిశీలించి ఆక్వా రైతులను అప్రమత్తం చేయాలన్నారు. శ్రీకాకుళంలో వంశధార, నాగావళి పరివాహక ప్రాంతాలు, పార్వతీపురం మన్యంలో కొండ ప్రాంతాలు, కోనసీమలో గోదావరి డెల్టా, ఆక్వా చెరువులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

ముమ్మిడివరం 6వ వార్డులో కూటమి అభ్యర్థుల విస్తృత ప్రచారం

ముమ్మిడివరం, సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 27

ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని 6వ వార్డులో ఉమ్మడి కూటమి అభ్యర్థుల ఎన్నికల ప్రచారం విస్తృతంగా కొనసాగింది. జనసేన పార్టీ చైర్‌పర్సన్ అభ్యర్థిని లిగుబ్బల గంగారత్న భవానిలి, 6వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిని ములపర్తి దుర్గా మహేశ్వరి (ములపర్తి బాలకృష్ణ కుమార్తె) ప్రజల మధ్యకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమానికి ముమ్మిడివరం టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ లికట్టా సత్తిబాబులి నాయకత్వం వహించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని అభ్యర్థులకు మద్దతుగా ముందుకు సాగారు. ఈ సందర్భంగా గుబ్బల గంగారత్న భవాని మాట్లాడుతూ, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ములపర్తి బాలకృష్ణ గతంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తూ, కూటమి ప్రభుత్వ సహకారంతో వార్డులో మరింత అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తామని ములపర్తి దుర్గా మహేశ్వరి తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ కట్టా సత్తిబాబు ఆధ్వర్యంలో సాగిన ఈ ప్రచారంతో 6వ వార్డులో ఎన్నికల సందడి నెలకొంది.

తుఫాన్ ప్రభావంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

16వ వార్డు కూటమి అభ్యర్థి ఏడువాక మహాలక్ష్మి సన్యాసిరావు

ఆరిలోవ , సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 27:

తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని 16వ వార్డు కూటమి అభ్యర్థి ఏడువాక మహాలక్ష్మి సన్యాసిరావు సూచించారు. రానున్న గంటల్లో వర్షాలు, బలమైన గాలుల ప్రభావం పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలబడవద్దని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షపు నీరు నిలిచే ప్రాంతాల్లో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. విద్యుత్ తీగలు తెగిపడిన ప్రాంతాలకు దూరంగా ఉండాలని, వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అధికారులు జారీ చేసే సూచనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైన సమయంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలను సంప్రదించాలని సూచించారు. ప్రజల భద్రతే ప్రధానమని పేర్కొంటూ, తుఫాన్ ప్రభావం తగ్గే వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి తమ కుటుంబ సభ్యులను సురక్షితంగా ఉంచుకోవాలని ఏడువాక మహాలక్ష్మి సన్యాసిరావు కోరారు.

గుర్రంకొండ మండలంలో ఎంపీటీసీ ఎన్నికల సమరం..

4 స్థానాల్లో 9 మంది అభ్యర్థుల పోటీ!

గుర్రంకొండ అక్టోబర్ 27 సిటిజన్ టైమ్స్

గుర్రంకొండ మండలంలో ఎంపీటీసీ ఎన్నికల వాతావరణం వేడెక్కింది. మండల పరిధిలోని మొత్తం 12 ఎంపీటీసీ స్థానాలకు గానూ, ఇప్పటికే 8 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 4 స్థానాల్లో ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ 4 స్థానాలలో ప్రస్తుతం మొత్తం 9 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచి తమ అదృష్టాన్ని పరీక్షించు కుంటున్నారు. గుర్రంకొండ-1,.గుర్రంకొండ-2, మరియు ఎల్లుట్ల, టి. పసల వాండ్లపల్లి స్థానాలలో బరిలో ఉన్నారు.పార్టీల వారీగా పోటీ చేస్తున్న అభ్యర్థుల వివరాలు ప్రధాన పార్టీలైన తెలుగుదేశం మరియు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు ఈ నాలుగు స్థానాలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.తెలుగు దేశం పార్టీ (టీడీపీ)04 గురు అభ్యర్థులు వైఎస్సార్ సీపీ (వైసీపీ): 04 గురు అభ్యర్థులు స్వతంత్ర అభ్యర్థి (ఇండిపెండెంట్)01 అభ్యర్థి ఈ నాలుగు స్థానాల్లోనూ అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ప్రధాన పోటీ నెలకొనగా, ఒక స్థానంలో స్వతంత్ర అభ్యర్థి సైతం రంగంలో ఉండటంతో ముక్కోణపు పోటీ ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే ఏకగ్రీవమైన స్థానాలు పోగా, మిగిలిన ఈ నాలుగు స్థానాలను దక్కించుకునేందుకు పార్టీల ముఖ్య నేతలు, అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను ఆకర్షించే పనిలో పడ్డారు.

తుపాను ముప్పును ఎదుర్కొనేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

కాకినాడ, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 27:

అర్నబ్ తుపాను నేపథ్యంలో ప్రజల ప్రాణరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. కాకినాడ జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో తుపాను సన్నద్ధతపై సమీక్ష నిర్వహించి, తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను సకాలంలో సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను సిద్ధం చేసి, తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు, దివ్యాంగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. విద్యుత్, రహదారులు, పారిశుధ్యం, అత్యవసర వైద్య సేవలకు అంతరాయం కలగకుండా సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏలేరు వరద ప్రవాహంపై నిరంతర నిఘా ఉంచాలని, మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు అధికారిక వాతావరణ హెచ్చరికలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో అధికారుల సూచనలను అనుసరించాలని పవన్ కళ్యాణ్ విజ్ఞప్తి చేశారు.



జనసేన అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేసిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 27

అంబేద్కర్ కోనసీమ జిల్లా, పి.గన్నవరం మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జనసేన పార్టీ తరఫున స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులకు బీ-ఫారాలను పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జనసేన పార్టీ తరఫున పోటీ చేస్తున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేయడం జరిగిందని, ప్రతి అభ్యర్థి తమ బీ-ఫారాలను నిర్ణీత సమయంలో సమర్పించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

12వ వార్డులో వైఎస్సార్‌సీపీ నేతల విస్తృత ప్రచారం



పులివెందుల, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 27:

పులివెందుల పట్టణంలోని 12వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు వైఎస్ మనోహర్ రెడ్డి, వైఎస్ కిరణ్ కుమార్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలోని ప్రజలను కలిసి పార్టీ అభ్యర్థుల విజయానికి మద్దతు కోరారు. చైర్మన్ అభ్యర్థితో పాటు 12వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి హాఫీజ్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో తమ అభ్యర్థులకు మద్దతు తెలిపి విజయాన్ని అందించాలని నాయకులు కోరారు.

రాజోలు మండలంలో 85 నామినేషన్లు.. 48 మంది తుది పోటీలో

రాజోలు: సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 27

రాజోలు మండలంలో మొత్తం 20 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి 85 నామినేషన్లు దాఖలయ్యాయి. పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ అనంతరం 48 మంది అభ్యర్థులు తుది పోటీలో నిలిచారు. పార్టీల వారీగా తుది అభ్యర్థులు ఈ విధంగా ఉంది.- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ - 20 మంది,- జనసేన పార్టీ - 10 మంది,- తెలుగుదేశం పార్టీ - 9 మంది,బహుజన్ సమాజ్ పార్టీ బీఎస్పీ - 4 మంది,- భారతీయ జనతా పార్టీ బిజెపి - 1 అభ్యర్థి, స్వతంత్ర అభ్యర్థులు - 4 మంది,మొత్తం - 48 మంది బరిలో ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి పి.భగవాన్ తెలిపారు.

వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కూటమి అభ్యర్థుల ప్రచారం

మధురవాడ జోన్ 8, 9, వార్డులలో జన సమూహం

ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ అభ్యర్థి ముక్క శ్రావణి -అభ్యర్థి ముక్కా శ్రావణికి ప్రజల ఘన స్వాగతం

మధురవాడ, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 27:
స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కూటమి మేయర్ అభ్యర్థి ముక్కా శ్రావణి మధురవాడ జోన్‌లోని 8,9వ వార్డుల్లో జోరుగా ప్రచారం నిర్వహించారు స్థానిక ఎమ్మెల్యే తనయుడు యువ నాయకుడు గంటా రవితేజతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. 8వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి పిల్లా రేవతి 9వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి నాగోతి రూపాకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రచార ర్యాలీకి స్థానిక ప్రజల నుంచి ఘన స్వాగతం లభించింది పలుచోట్ల మహిళలు హారతులు ఇచ్చి నీరాజనాలు పలుకుతూ అభ్యర్థులకు ఆత్మీయ స్వాగతం పలికారు

వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నాయకులు కార్యకర్తలు ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది ప్రజలను నేరుగా కలుసుకుంటూ కూటమి అభ్యర్థులు తమ ప్రచారాన్ని కొనసాగించారు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజలు చూపిన అభిమానంతో కూటమి శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది ప్రజల నుంచి లభిస్తున్న స్పందన కూటమిపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు. అభివృద్ధి సంక్షేమం ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న కూటమికి ప్రజల మద్దతు మరింత బలపడుతోందని వారు ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో భాగంగా మేయర్ అభ్యర్థి ముక్క శ్రావణి మాట్లాడుతూ ప్రజల ఆదరణతోనే విజయం సాధ్యమవుతుందని ఆ ఉత్సాహాన్ని పోలింగ్ రోజు కూడా కొనసాగించాలని కోరారు ఇప్పటికే విజయం ఖాయమనే ధీమాతో నిర్లక్ష్యం చేయకుండా రాబోయే ఒకటో తేదీన జరిగే పోలింగ్‌లో ప్రతి ఓటరూ బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.. యువత మహిళలు రాబోయే తరానికి ప్రాధాన్యం కల్పిస్తూ ముందుకు సాగుతున్న కూటమికి ప్రజలు తమ మద్దతుతో విజయాన్ని అందించాలని ముక్క శ్రావణి కోరారు ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలంటే కూటమి అభ్యర్థుల విజయమే కీలకమని పేర్కొన్నారు.

గిద్దలూరు మున్సిపాలిటీ ఎన్నికలకు నియమించబడిన ఎన్నికల సిబ్బందికి ట్రైనింగ్ ఇచ్చిన మాస్టర్ ట్రైనర్ డాక్టర్ మొర్రి.పిచ్చయ్య

గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 27
గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలోని 28 వార్డులకు వార్డ్ కౌన్సిలర్, చైర్ పర్సన్ కు నవంబర్ 1న నిర్వహించనున్న ఎన్నికల సిబ్బందికి రెండో విడత శిక్షణ తరగతులు మున్సిపల్ కమిషనర్ రమణ బాబు ఆధ్వర్యంలో నిర్వహించడం జరినది. ఈ ట్రైనింగ్ లో ఎన్నికల ప్రక్రియకు నియమించబడిన దాదాపు 150 మంది ఎన్నికల సిబ్బందికి ఎన్నికలకు సంబంధించిన సంపూర్ణ విషయాలను మాస్టర్ ట్రైనర్ డాక్టర్ మొర్రి. పిచ్చయ్య వివరించారు. ఈ శిక్షణా తరగతులల్లో ప్రిసైడింగ్ ఆఫీసర్స్ మరియు ఇతర పోలింగ్ సిబ్బంది నిర్వహించవలసిన డ్యూటీలను, ఎన్నికల ప్రక్రియకు ముందు, ఎన్నికల ప్రక్రియ జరిగేటప్పుడు, ఎన్నికల ప్రక్రియ ముగింపు అనంతరం చేయవలసిన పనులను ,ఫామ్స్ పూరణ, కవర్ల వారీగా సీలింగ్ చేయవలసిన విషయాలను, బ్యాలెట్ బాక్స్ ఓపెనింగ్,షెమిలాక్, ఫుల్ లాక్ విధానాన్ని ప్రాక్టికల్గా వివరించడం జరిగినది. మాస్టర్ ట్రైనర్ గా సమర్థవంతంగా శిక్షణా తరగతులను నిర్వహించిన డాక్టర్ మొర్రి పిచ్చయ్యను దుశ్శాలుతో, గిఫ్ట్ తో మున్సిపల్ కమిషనర్ సన్మానించారు. కమిషనర్ ఏర్పాటు చేసిన అన్ని సదుపాయాలు మంచిగా ఉన్నాయని ఎన్నికల సిబ్బంది తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆఫీసు సిబ్బంది రాజారెడ్డి, రవీంద్ర, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

త్రిబుల్ ఇంజన్ సర్కారుతోనే గిద్దలూరు అభివృద్ధి..

వైకాపా ఎత్తుగడలు ఇక చెల్లవు

-వైఎస్సార్ సీపీ పై ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఘాటైన వ్యాఖ్యలు..

గిద్దలూరు, అక్టోబర్ 27 (సిటిజన్ టైమ్స్):
స్థానికతకు విలువనిస్తూ, ప్రాధాన్యతనిస్తూ స్థానిక అభ్యర్థులనే గెలిపించాలని గిద్దలూరు ఎమ్యెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు. నవంబర్ 1వ తేదీన జరుగనున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో గిద్దలూరు పురపాలక సంఘం చైర్ పర్సన్ గా కూటమి పార్టీలు బలపరిచిన బిజెపి అభ్యర్థి డా. జె వి నారాయణను, తెలుగు దేశం అభ్యర్థులుగా 24 వార్డుల్లో,జనసేన అభ్యర్థులుగా మరో నాలుగు వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఓటర్లను కోరారు. పట్టణంలోని ఎస్. ఎస్ ప్లాజాలో మంగళవారం జరిగిన ఆర్యవైశ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపారం కోసం గిద్దలూరుకు వచ్చినవారు స్వార్ధ ప్రయోజనాల కోసం ఎన్నికల్లో పోటీ చేశారని దీనిని ప్రజలు గుర్తించాలని,గిద్దలూరు ప్రజలు విజ్ఞులు, చైతన్య వంతులని మీ రౌడీయిజాన్ని ఇక్కడ ప్రవేశపెడతామంటే ఇక్కడి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ప్రత్యర్థి పార్టీ అభ్యర్థిని ఉద్దేశించి ఎమ్మెల్యే కీలక వ్యాఖ్యలు చేశారు. కూటమి అభ్యర్థి డాక్టర్ జె.వి నారాయణ పిల్లల వైద్యులుగా మన ప్రాంతానికి సుపరిచితులని వారిని గెలిపించడం ద్వారా స్థానికత గెలుస్తుందన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిని గెలిపిస్తే త్రిబుల్ ఇంజన్ సర్కార్ వచ్చి అభివృద్ధి దూసుకుపోతుందన్నారు.

ఆర్నబ్ తుఫాన్ బాధితులకు తక్షణ సహాయం: జీవీ రామచంద్రరావు

అత్యవసర పరిస్థితుల్లో స్పందించేందుకు సిద్ధం.. మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 27:
ఆర్నబ్ తుఫాన్ నేపథ్యంలో ప్రభావిత ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తన బృందం సిద్ధంగా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మత్స్యకార నాయకుడు జీవీ రామచంద్రరావు తెలిపారు. తుఫాన్ బాధితులకు అండగా నిలిచేందుకు తన సిబ్బంది, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, సహచరులు అందుబాటులో ఉంటారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖపట్నం నగరంతో పాటు తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలకు, ముఖ్యంగా మత్స్యకారులకు అవసరమైన సహాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యల్లో పాల్గొంటామని స్పష్టం చేశారు. తుఫాన్ ప్రభావం దృష్ట్యా తీర ప్రాంత ప్రజలు, ముఖ్యంగా మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని జీవీ రామచంద్రరావు సూచించారు. వాతావరణ పరిస్థితులను గమనిస్తూ అధికారులు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. తుఫాన్ సమయంలో అత్యవసర సహాయం అవసరమైన ప్రజలు 9849944449 నంబర్‌ను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలిచి, తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నానని జీవీ రామచంద్రరావు పేర్కొన్నారు.

ఎంపీపీగా అనుమోలు సరస్వతి జడ్పిటిసిగా పూరిమిట్ల ఏమాధవి ఏకగ్రీవం

పొన్నలూరు పెన్ పవర్ అక్టోబర్ 27
ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగియడంతో తెలుగుదేశం పార్టీ కూటమి మండలంలో మంగళవారం 12 ఎంపీటీసీ స్థానాలకు గాను 12 ఎంపీటీసీ స్థానాలు, జడ్పిటి స్థానం ఏకగ్రీవంగా ఎన్నికైనారు. మూడు స్థానాల్లో వైసిపి అభ్యర్థులు నామినేషన్ కు తిరస్కరణకు గురికావడంతో మిగిలిన 9 స్థానాలకు వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. 12 స్థానాలు టిడిపి కైవసం చేసుకుంది. సింగరమట్లపాలెం ఎంపీటీసీ స్థానం నుండి దాసరి దత్తాత్రేయ, చెరుకూరు ఎంపీటీసీ స్థానం నుండి తన్నీరు వీరమ్మ, చెన్నుపాడు ఎంపీటీ స్థానం నుండి మాదాల శ్రీను, పొన్నలూరు నుండి కొత్తకోట పద్మ, తిమ్మపాలెం నుండి గెట్టబోయిన శారద, రావులకొల్లు నుండి అనుమోలు సరస్వతి, వెల్లటూరు నుండి పూరి మెట్ల రత్తమ్మ, భోగనంపాడు నుండి పిల్లి వెంకట కృష్ణారెడ్డి, మాలపాడు నుండి పసల వెంకట్రావు, కోటపాడు నుండి అన్నెం రోశమ్మ, చౌటపాలెం నుండి పాతూరి సుజాత, విప్పగుంట నుండి నన్నెం అలరాజు ఎంపీటీసీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు వీరిలో ఎంపీపీగా అనుమోలు సరస్వతి జడ్పిటిసి గా పూరిమిట్ల మాధవి ఎన్నికయ్యారు వీరందరికీమండలంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

అభివృద్ధే మా అజెండా.. గెలుపే మా లక్ష్యం!

14 ఎంపీటీసీ స్థానాలతో పాటు జడ్పీటీసీ స్థానాన్ని కైవసం చేసుకుంటాం

మంత్రి సవితమ్మకు విజయాన్ని కానుకగా అందిస్తాం: ఎంపీపీ అభ్యర్థి నీరుగంటి చంద్రశేఖర్

సోమందేపల్లి, అక్టోబర్ 27 (సిటిజన్ టైమ్స్):
సోమందేపల్లి గ్రామం లోని సాయి నగర్ లో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ప్రజలకు జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తామని ఎంపీపీ అభ్యర్థి నీరుగంటి చంద్రశేఖర్ తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

మండలంలోని 14 ఎంపీటీసీ స్థానాలతో పాటు జడ్పీటీసీ స్థానాన్ని కూడా కైవసం చేసుకుని, రాష్ట్ర మంత్రి సవితమ్మకు విజయాన్ని కానుకగా అందిస్తామని పేర్కొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల్లోకి వెళ్తున్నారని, అభివృద్ధి పనులే తమకు ప్రధాన ప్రచారాస్త్రాలని వివరించారు. ప్రజల ఆశీర్వాదంతో కూటమి అభ్యర్థులు ఘనవిజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజల నుంచి మంచి స్పందన: బీజేపీ యువ నాయకుడు ఎస్.ఆర్. పార్థసారథిరెడ్డి..: ఈ సందర్భంగా సాయి నగర్ లో బీజేపీ యువ నాయకుడు ఎస్.ఆర్. పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ, సోమందేపల్లి మండలంలోని వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి జరిగిందని, ప్రజల నుంచి కూటమి అభ్యర్థులకు మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. ప్రజల మద్దతుతో కూటమి అభ్యర్థులు అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. మండల అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు.

మందుబాబులకు జరిమానా.. జైలు శిక్ష – ట్రాఫిక్ సీఐ హజరతయ్య వెల్లడి

ఒంగోలు క్రైమ్, అక్టోబర్ 27 (సిటిజన్ టైమ్స్):

మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 13 మందిని మంగళవారం స్థానిక న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు ఒంగోలు ట్రాఫిక్ చావా హాజరతయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. పట్టుబడిన వారిలో 11 మంది వాహనదారులకు ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున జరిమాన, అలాగే ఇద్దరికీ మూడు రోజులు జైలు శిక్షను న్యాయస్థానం విధించినట్లు సిఐ తెలిపారు.

ఎదురాళ్లపాడు ఎంపీటీసీగా వెంకటలక్ష్మి ఏకగ్రీవం

కొనకనమిట్ల పెన్ పవర్ అక్టోబర్ 27
కొనకనమిట్ల మండలం ఎదురాళ్లపాడు ఎంపీటీసీ స్థానం నుంచి టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి మోరబోయిన వెంకటలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియలో వైసీపీ అభ్యర్థి నామినేషన్ ఉపసంహరించుకోవడంతో వెంకటలక్ష్మి ఎన్నిక ఏకగ్రీవమైంది.ఈ విషయాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి గోపాల్ సింగ్ నాయక్ అధికారికంగా ప్రకటించి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.ఎదురాళ్లపాడు ఎంపీటీసీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో పార్టీ నాయకులు,కార్యకర్తల్లో హర్షం వ్యక్తమైంది.ఈ సందర్భంగా వెంకటలక్ష్మికి టీడీపీ శ్రేణులు,గ్రామస్థులు అభినందనలు తెలిపారు.ఎంపీటీసీగా గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని గ్రామస్థులు ఆకాంక్షించారు.గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని పలువురు సూచించారు.

అర్ధవీడు మండల 9 ఎంపీటీసి స్థానాలు టీడీపీ, జనసేన ఒకటి కైవసం

అర్ధవీడు, అక్టోబర్ 27 (సిటిజన్ టైమ్స్):
అర్ధవీడు మండలం 10 ఎంపీటీసీ స్థానాలు కూటమి కైవసమైంది. వెలగలపాయ టిడిపి అభ్యర్థి బి రామలక్ష్మమ్మ, యాచవరం టిడిపి ఎస్ రక్షిత రెడ్డి, మాగుటూరు టిడిపి కె నాగలక్ష్మమ్మ, కాకర్ల టిడిపి డి రమాదేవి, పెద్ద కందుకూరు టిడిపి ఎం ఆవులయ్య, దొనకొండ టిడిపి ఏ రాణెమ్మ, అర్ధవీడు టిడిపి షేక్ జిలాని, బొల్లుపల్లె టిడిపి ఎస్ చిన్న గురువయ్య, మొహిద్దినపురం టిడిపి వి మహాలక్ష్మమ్మ, పాపినేని పెల్లి జనసేన కాల్వ బాల రంగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలియజేశారు.

ఆర్యవైశ్య సంఘం సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి, సోము వీర్రాజు

గిద్దలూరు, అక్టోబర్ 27 (సిటిజన్ టైమ్స్):
పట్టణంలోని ఎస్.ఎస్. ప్లాజాలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి , రాష్ట్ర మాజీ బీజేపీ అధ్యక్షులు, ప్రస్తుత ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కూటమి ప్రభుత్వం బలపరిచిన మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి జె.వి. నారాయణ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గిద్దలూరు పట్టణ అభివృద్ధికి సహకరించే దిశగా తమ అమూల్యమైన ఓటును కమలం గుర్తుపై వేసి జె.వి. నారాయణ ని కౌన్సిలర్ అభ్యర్థులు 24 మంది అభ్యర్థులకు సైకిల్ గుర్తు , 4 వార్డు లలో గాజు గ్లాసు గుర్తు పై ఓటువేసి, వేయించి గెలిపించాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులను కోరారు. పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజల సహకారం అవసరమని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెదిరింపులకు భయపడేది లేదు: డాక్టర్. చింతలపూడి అశోక్ కుమార్

'డబ్బులు ఇస్తాం.. విత్‌డ్రా చేసుకో' అంటూ ప్రలోభపెడుతున్న ఆడియోను వినిపించిన సమన్వయకర్త.

అద్దంకి పట్టణాభివృద్ధికి 'సప్త సంకల్పాలు' ఎన్నికల ప్రణాళిక విడుదల



అద్దంకి, అక్టోబర్ 27 (సిటిజన్ టైమ్స్)

ఎన్నికల వేళ ప్రత్యర్థులు ఎన్ని బెదిరింపులకు పాల్పడినా, ప్రలోభాలు పెట్టినా ప్రజాక్షేత్రంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్. చింతలపూడి అశోక్ కుమార్ స్పష్టం చేశారు. స్థానిక పురపాలక ఎన్నికల నేపథ్యంలో అద్దంకిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ?ఈ సందర్భంగా డాక్టర్. అశోక్ కుమార్ మాట్లాడుతూ.. అద్దంకిలో టీడీపీ నాయకులు అరాచకాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. తమ పార్టీ అభ్యర్థులను కిడ్నాప్ చేయడం, బెదిరించడం, 5 నుంచి 15 లక్షల రూపాయల వరకు ఎరచూపి ప్రలోభపెట్టడం వంటి చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన సంభాషణల ఆధారాలను ఆయన విలేకరుల ముందుంచారు. సంఘటనలను చిత్రీకరిస్తున్న విలేకరుల చేతుల్లోని చరవాణులను బలవంతంగా లాక్కోవడం దారుణమని, పోలీసు యంత్రాంగం కూడా ఇందుకు సహకరించడం శోచనీయమన్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చింది రౌడీయిజం చేయడానికి కాదని, ఒక వైద్యుడిగా ప్రజలకు నిస్వార్థ సేవ చేయడానికేనని స్పష్టం చేశారు.

అద్దంకి పురోభివృద్ధికి 'సప్త సంకల్పాలు'..

అద్దంకి పట్టణ సమగ్ర అభివృద్ధిని కాంక్షిస్తూ 'సప్త సంకల్పాలు' పేరుతో రూపొందించిన ప్రత్యేక ఎన్నికల ప్రణాళికను ఆయన విడుదల చేశారు. వంద పడకల పెద్దాసుపత్రితో పాటు రక్తనిధి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం, పన్నెండు లక్షల రూపాయల లోపు వార్షిక ఆదాయం ఉన్న కుటుంబాల్లోని ప్రతి ఆడపిల్లకు పదో తరగతి వరకు ఉచిత విద్య అందించడం, పద్దెనిమిదేళ్లు నిండిన యువతులకు ఇంటి ఆడబిడ్డలా పెళ్లి కానుక ఇవ్వడం, ఇంటింటికీ తాగునీటి సరఫరా, ఎన్టీఆర్ నగర్‌ను ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దడం, భవానీ కూడలిలో రాకపోకల సమస్యను పరిష్కరించడం, పది ఎకరాల్లో అధునాతన క్రీడా ప్రాంగణం నిర్మించడం వంటి ప్రధాన హామీలను ఇందులో పొందుపరిచారు. పట్టణ ప్రగతిని కోరుకునే ప్రజలంతా ఆలోచించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించాలని ఆయన కోరారు.

పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా రన్ ఫర్ యూనిటీ

మార్కాపురం, అక్టోబర్ 27 (సిటిజన్ టైమ్స్)

జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా ఆదేశాల మేరకు పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మార్కాపురంలో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ సమైక్యత, దేశ సమగ్రత, సోదరభావం, సామాజిక సామరస్యాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. మార్కాపురం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి కోర్టు సెంటర్ వరకు నిర్వహించిన ఈ రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని ఓఎస్డీ (అడ్మిన్) నవజ్యోతి మిశ్రా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ఐకమత్యంతో మెలగాలని, దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఆశయాలకు అనుగుణంగా శాంతియుత, సామరస్యపూర్వక సమాజ నిర్మాణానికి కృషి చేయాలని, ముఖ్యంగా యువత జాతీయ సమైక్యతను బలోపేతం చేసే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం డీఎస్పీ నిమ్మగడ్డ సత్యనారాయణ, ఎస్బీ సీఐ మధుబాబు, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసరావు, ఐటీ కోర్ సీఐ ప్రకాశరావు, ఆర్ఐ ఓ. రవికుమార్, మార్కాపురం టౌన్ ఎస్ఐ హర్షవర్ధన్ రెడ్డి, రూరల్ ఎస్ఐ శ్రీ వేమన, ఆర్ఎస్ఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీటీసీ జడ్పిటిసి ఏపీవోలకు శిక్షణ

పొన్నలూరు, అక్టోబర్ 27 (సిటిజన్ టైమ్స్)

మండల పరిషత్ కార్యాలయము ఆవరణలో వెలుగు కార్యాలయంలో ఎంపీటీసీ జడ్పిటిసి ఏ పి ఓ లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి పి నాగమణి ఎంపీడీవో ఎంవోటీస్ వై వెంకటేశ్వరావు పోలింగ్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాటిచెర్ల ఎంపిటిసి సభ్యురాలుగా బోనేని రమణమ్మ (టిడిపి) ఏకగ్రీవంగా ఎన్నిక.

బోనేని రమణమ్మ కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేనీ వెంకటేశ్వర్లు యాదవ్ సతీమణి. శ్రీశైలం దేవస్థానం ట్రస్టు సభ్యురాలుగా బాధ్యతలు నిర్వహిస్తున్న బోనేని రమణమ్మ.

కొమరోలు, అక్టోబర్ 27 (సిటిజన్ టైమ్స్)

కొమరోలు మండలం తాటిచెర్ల ఎంపిటిసి సభ్యురాలిగా తెలుగుదేశం పార్టీకి చెందిన బోనేని రమణమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తాటిచెర్ల ఎంపిటిసి స్థానానికి పలువురు తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అయితే నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారంతో ముగిసింది. దీనితో తాటిచెర్ల ఎంపిటిసి స్థానానికి నామినేషన్ దాఖలు చేసిన మిగిలిన అభ్యర్థులందరూ తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో బోనేని రమణమ్మ నామినేషన్ ఒక్కటే మిగిలింది. దీనితో ఎన్నికల రిటర్నింగ్ అధికారి బోనేని రమణమ్మ తాటిచెర్ల ఎంపిటిసి సభ్యురాలుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా ప్రకటించారు. బోనేని రమణమ్మ కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ సతీమణి. రమణమ్మ శ్రీశైలం దేవస్థానంలో ట్రస్ట్ సభ్యురాలుగా విధులు నిర్వహిస్తున్నారు. భర్త వెంకటేశ్వర్లు యాదవులే తాను కూడా ప్రజాసేవ చేస్తూ తాటిచెర్ల పంచాయతీ అభివృద్ధికి,ప్రజా సంక్షేమానికి,గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి,తన భర్త వెంకటేశ్వర్లు యాదవ్ సహకారంతో కృషి చేస్తానని ఆమె తెలిపారు. తాను తాటిచెర్ల ఎంపిటిసి సభ్యురాలుగా ఏకగ్రీవంగా ఎన్నిక అవుటకు సహాయ సహకారాలు అందించిన శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి కి, గిద్దలూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డికి, కొమరోలు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొమరోలు సహకార సంఘం చైర్పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డికి, తదితర మండల స్థాయి నేతలకు, తాటిచర్ల పంచాయతీలోని తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలకు అభిమానులకు, కూటమి పార్టీల నేతలకు కార్యకర్తలకు రమణమ్మ ధన్యవాదాలు తెలిపారు. ఎంపిటిసి సభ్యురాలిగా ఎన్నికైన రమణమ్మను గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి, కృష్ణ కిషోర్ రెడ్డి,సంజీవరెడ్డి, బిజ్జం రవీంద్రారెడ్డి తో పాటు పలువురు తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

కొమరోలు మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలకు, జడ్పిటిసి స్థానానికి సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక

11 ఎంపిటిసి స్థానాలతో పాటు జడ్పిటిసి స్థానానికి ఏకగ్రీవంగా ఎన్నికైన తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు.

కొమరోలు 1 ఎంపీటీసీ స్థానానికి ఏకగ్రీవంగా ఎన్నికైన సిపిఐఎం అభ్యర్థి పోసాని నాగమణి.

కొమరోలు, అక్టోబర్ 27 (సిటిజన్ టైమ్స్)

కొమరోలు మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలతో పాటు ఒక జడ్పిటిసి స్థానానికి సభ్యులు ఏకగ్రీవ ఎన్నికయ్యారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారంతో ముగిసింది. దీనితో ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల పేర్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. అయితే నామినేషన్ల ఉపసంహరణ అనంతరం కొమరోలు మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలలో ఒక్కొక్కరు మాత్రమే అభ్యర్థులు బరిలో నిలవడంతో వారందరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. కొమరోలు1 ఎంపీటీసీ సభ్యురాలుగా పోసాని నాగమణి, కొమరోలు 2 ఎంపీటీసీ సభ్యురాలిగా వీరం రెడ్డి లక్ష్మీ రాజా దేవి, కొమరోలు3 ఎంపీటీసీ సభ్యురాలిగా కూరాకు వెంకటసుబ్బమ్మ, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే అల్లినగరం ఎంపీటీసీ సభ్యులుగా కానెగారి రామస్వామి, రెడ్డిచర్ల ఎంపిటిసి సభ్యులుగా బిజ్జాల తిరుమలరెడ్డి, సూరవారిపల్లె ఎంపీటీసీ సభ్యులుగా వడ్డే వెంకటయ్య, ఎడమ కళ్ళు ఎంపీటీసీ సభ్యురాలిగా మూర్ఖ రాజేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజుపాలెం ఎంపీటీసీ సభ్యురాలిగా షేక్ మహబూబ్ బి, దద్దవాడ ఎంపిటిసి సభ్యులుగా బిజ్జం వెంకట్రామిరెడ్డి, తాటిచెర్ల ఎంపిటిసి సభ్యురాలుగా బోనేని రమణమ్మ, నల్లగుంట్ల ఎంపీటీసీ సభ్యురాలుగా మంద మార్తమ్మ, చింతలపల్లి ఎంపీటీసీ సభ్యురాలిగా సారే సుభద్ర దేవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. దీనితో కొమరోలు మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలకు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుంది. కొమరోలు మండల జడ్పిటిసి సభ్యురాలిగా ముత్తుముల హరితమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన 12 మంది ఎంపీటీసీ సభ్యులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి నియామక పత్రాలు అందించి అభినందించారు. ఎంపీటీసీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన 12 మందిని కొమరోలు జడ్పిటిసి సభ్యురాలుగా ఎన్నికైన ముత్తుముల హరితమ్మను కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనీని వెంకటేశ్వర్లు యాదవ్, ఇడమ కళ్ళు సహకార సంఘం అధ్యక్షులుబిజ్జం రవీంద్రారెడ్డి, టిడిపి నేతలు వీరం రెడ్డి శంకర్ రెడ్డి తదితర నేతలు కార్యకర్తలు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా కొమరోలు మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలు,జడ్పిటిసి స్థానాన్ని తెలుగుదేశం పార్టీ, సిపిఐ ఎం పార్టీల అభ్యర్థులు కైవసం చేసుకోవడంతో ఆ పార్టీల నేతలు కార్యకర్తలు మంగళవారం సాయంత్రం బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

కొమరోలు ఎంపీటీసీ1 సభ్యురాలిగా గా సిపిఐఎం అభ్యర్థిని పోసాని నాగమణి ఏకగ్రీవంగా ఎన్నిక

కొమరోలు మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలకు ఏకగ్రీవంగా ఎన్నికలు.

11 ఎంపీటీసీ స్థానాలకు టిడిపి అభ్యర్థులు,కొమరోలు 1 ఎంపీటీసీ స్థానానికి సిపిఐఎం అభ్యర్థి ఎంపిక.

కొమరోలు మండల పరిషత్ చరిత్రలో సిపిఐఎం అభ్యర్థి ఎంపీటీసీగా ఎన్నికై రికార్డు సృష్టించిన పోసాని నాగమణి

కొమరోలు, అక్టోబర్ 27 (సిటిజన్ టైమ్స్)

కొమరోలు మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలకు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికలలో భాగంగా కొమరోలు మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, వాటికి పలువురు టిడిపి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు అయితే కొమరోలు1 ఎంపీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థులతో పాటు సిపిఐఎం అభ్యర్థిగా పోసాని నాగమణి, కొమరోలు 2 ఎంపీటీసీ స్థానానికి టిడిపి అభ్యర్థులతో పాటు సిపిఐ ఎం అభ్యర్థిగా ఎంబడి రేణుక, కొమరోలు3 ఎంపీటీసీ స్థానానికి సిపిఐఎం అభ్యర్థిగా పోసాని అంజమ్మ నామినేషన్ శాఖలు చేశారు. అయితే తెలుగుదేశం పార్టీ, సిపిఐ ఎం పార్టీ నేతల మధ్య కుదిరిన రాజీ ఒప్పందమేరకు కొమరోలు ఒకటి ఎంపీటీసీ స్థానానికి నామినేషన్లు దాఖలు చేసిన టిడిపి అభ్యర్థులు మంగళవారం తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో కొమరోలు 1 ఎంపీటీసీ స్థానానికి సిపిఐఎం అభ్యర్థి పోసాని నాగమణి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. అలాగే కొమరోలు 2, కొమరోలు 3 ఎంపిటిసి స్థానాలకు సిపిఐఎం అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన ఎంబటి రేణుక,పోసాని అంజమ్మ తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో కొమరోలు 2 ఎంపీటీసీ స్థానానిక వీరం రెడ్డి లక్ష్మి రాజా దేవి, కొమరోలు 3 ఎంపీటీసీ స్థానానికి కూరాకు వెంకట సుబ్బమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. ఇక మిగిలిన 9 ఎంపిటిసి స్థానాలకు కూడా టిడిపి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. దీనితో కొమరోలు మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలో 11 ఎంపీటీసీ స్థానాలు టిడిపి అభ్యర్థులు,ఒక ఎంపీటీసీ స్థానాన్ని సిపిఐఎం అభ్యర్థి కైవసం చేసుకున్నట్లయింది. మండల పరిషత్ చరిత్రలో ఎంపీటీసీ సభ్యురాలిగా సిపిఐఎం అభ్యర్థి విజయం సాధించడం ఇదే తొలిసారి. సిపిఐఎం అభ్యర్థి పోసాని నాగమణి ఎంపీటీసీ సభ్యురాలిగా ఎన్నికై కొమరోలు మండల పరిషత్ చరిత్రలో రికార్డు సృష్టించారు. కొమరోలు 1 ఎంపీటీసీగా పోసాని నాగమణి కావడం పట్ల ఆ పార్టీకి చెందిన నేతలు, కార్యకర్తలతో పాటు నాగమణి బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పలు పార్టీల నేతలు నాగమణిని అభినందించారు.

కిష్టంశెట్టి పల్లె 2 ఎంపీటీసీగా ముత్యాల పాటి రంగనాయకులు ఏకగ్రీవ ఎన్నిక

గిద్దలూరు, అక్టోబర్ 27 (సిటిజన్ టైమ్స్)

గిద్దలూరు మండలం కిష్టం శెట్టి పల్లె 2 ఎంపీటీసీగా ముత్యాల పాటి రంగనాయకులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు ఆయనకు ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఏకగ్రీవంగా ఎన్నికైన ముత్యాల పాటి రంగనాయకులు కు పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ గ్రామ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. రంగనాయకులు మండల పరిషత్ అధ్యక్షులుగా ఎన్నిక కానున్నారు .ఈ ఎన్నిక లాంఛనమే.

రాజుపాలెం ఎంపీటీసీ సభ్యురాలిగా షేక్ మహబూబ్ బి ఏకగ్రీవంగా ఎన్నిక

రాజుపాలెం తెలుగుదేశం పార్టీ కన్వీనర్ షేక్ దాదాభాష సతీమణి మహబూబ్ బి

మహబూబ్ బిని అభినందించిన అధికారులు తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు

కొమరోలు, అక్టోబర్ 27 (సిటిజన్ టైమ్స్)

కొమరోలు మండలం రాజుపాలెం ఎంపీటీసీ సభ్యురాలిగా తెలుగుదేశం పార్టీకి చెందిన షేక్ మహబూబ్ బి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజుపాలెం ఎంపిటిసి స్థానానికి నామినేషన్ దాఖలు చేసిన పలువురు అభ్యర్థులు మంగళవారం తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో రాజుపాలెం ఎంపీటీసీ స్థానానికి ఎన్నికల బరిలో తెలుగుదేశం పార్టీకి చెందిన అభ్యర్థి షేక్ మహబూబ్ బి నామినేషన్ ఒక్కటే నిలిచింది. దీనితో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజుపాలెం ఎంపీటీసీ సభ్యురాలుగా షేక్ మహబూబ్ బి ఎన్నికైనట్లుగా ప్రకటించారు. ఎంపిటిసి సభ్యురాలుగా ఏకగ్రీవ ఎన్నికైన షేక్ మహబూబ్ బి రాజుపాలెం పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ దాదాభాష సతీమణి. తన భర్త వలె తాను కూడా రాజుపాలెం అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కృషి చేస్తానని,అందుకు రాజుపాలెం పంచాయతీలోని ప్రజలందరూ తనకు సహకరించాలని మహబూబ్ బి కోరారు. తాను రాజుపాలెం ఎంపీటీసీ సభ్యురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికలకు పూర్తి సహాయ సహకారాలు అందించిన గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక రెడ్డికి, నియోజకవర్గాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డికి, గిద్దలూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డికి, కొమరోలు సహకార సంఘం చైర్ పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డికి, కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్కు, ఎడమ కళ్ళు సహకార సంఘం అధ్యక్షులు బిజ్జం రవీంద్రారెడ్డికి, రాజుపాలెం పంచాయతీలోని తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు మండల స్థాయి నేతలకు కార్యకర్తలకు, తన బంధుమిత్రులకు, శ్రేయోభిలాషులకు, అభిమానులకు అధికారులకు మహబూబ్ బి ధన్యవాదాలు తెలిపారు. ఎంపీటీసీ సభ్యురాలుగా ఏకగ్రీవంగా ఎన్నికైన మహబూబ్బిని తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు అభిమానులు, బంధుమిత్రులు శ్రేయోభిలాషులు, అధికారులు, రాజుపాలెం గ్రామపంచాయతీ స్పెషల్ అధికారి ,జి. ఈరయ్య, స్వర్ణ గ్రామ సిబ్బంది అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

మానవత్వం చాటుకున్న డాక్టర్ షేక్ షబానా

మానసిక వికలాంగుల చిన్నారులకు స్వీట్లు పంపిణీ

మార్కాపురం, అక్టోబర్ 27 (సిటిజన్ టైమ్స్)

పట్టణానికి చెందిన ప్రముఖ మైనార్టీ నాయకురాలు డాక్టర్ షేక్ షబానా జవహర్ నగర్ లోని స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ లో మానసిక వికలాంగుల చిన్నారులకు చిన్నారులకు స్వీట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. తన పుట్టినరోజును వారి మధ్య జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. డాక్టర్ షబానా మాట్లాడుతూ నా పుట్టినరోజును సేవా కార్యక్రమంతో జరుపుకోవడం ఆనందంగా ఉంది. నన్ను ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికీ, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రజా ప్రతినిధులు, మహిళా నాయకులు, స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు హాజరై డాక్టర్ షబానాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

రామ్ చరణ్ ఆ రెండు పాత్రల్లో కనిపిస్తే మామూలుగా ఉండదా?

తెలుగు సినిమా ఇండస్ట్రీలో కెరియర్ ను స్టార్ట్ చేసిన రామ్ చరణ్ ప్రస్తుతం గ్లోబల్ స్టార్ గా అవతరించాడు. 'ఆర్ఆర్ఆర్' మూవీలో రామరాజు పాత్ర తనను ప్రపంచానికి పరిచయం చేసింది. హాలీవుడ్ మేకర్స్ సైతం రామ్ చరణ్ నటనకు ఫిదా అయ్యారు. ప్రస్తుతం సుకుమార్ డైరెక్షన్లో చేస్తున్న సినిమా విషయంలో ఆయన స్పెషల్ కేర్ తీసుకుంటున్నాడు. పాన్ వరల్డ్ నేపథ్యంలో తెరకెక్కే ఈ సినిమాతో మరోసారి ప్రపంచ సినీ ప్రేక్షకులను అలరించాలనే ప్రయత్నం చేస్తున్నాడు...

లైమ్ గ్రీన్ దుస్తుల్లో ఆకట్టుకుంటున్న రాయ్ లక్ష్మి

వైవిధ్యమైన పాత్రల్లో రామ్ చరణ్...

మెగా పవర్ స్టార్ గా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తున్న రామ్ చరణ్ కెరియర్ లో ఎన్నో డిఫరెంట్ పాత్రలను పోషించాడు. కానీ అతను ఒక రెండు పాత్రల్లో కనిపిస్తే మాత్రం సంచలనమైన రికార్డులు నమోదవుతాయి... 'డార్క్ షేడ్స్ ఉన్న గ్యాంగ్ స్టర్' గా తను కనిపిస్తే చూడాలని అతని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకు రామ్ చరణ్ అలాంటి పాత్రలో నటించలేదు. స్టైలిష్ డాన్ లుక్ లో కనిపిస్తే ఇండస్ట్రీ రికార్డులు బ్రేక్ అవుతాయి. పాన్ ఇండియాలో సైతం రామ్ చరణ్ కు స్పెషల్ క్రేజ్ ఉంది. కాబట్టి వాళ్లు సైతం ఈ సినిమా మీద ఎక్కువగా ఇంట్రెస్ట్ చూపించే అవకాశాలైతే ఉన్నాయి...

రామ్ చరణ్ ఆర్మీ సోల్జర్ గా కనిపిస్తే చూడాలని చాలా మంది ప్రేక్షకులు కోరుకుంటున్నారు. నిజానికి ఆయన 'ఆర్ఆర్ఆర్' సినిమాలో బ్రిటిష్ సైన్యం లో పనిచేసే పోలీస్ ఆఫీసర్ గా కనిపించాడు. ఈ జనరేషన్లో ఇండియా తరపున ఫైట్ చేసే ఒక సిన్సియర్ ఆర్మీ ఆఫీసర్ గా కనిపిస్తే చూడాలని చాలామంది కోరుకుంటున్నారు. డిఫరెంట్ పాత్రలు దొరికితే తన మార్క్ చూపిస్తూ ప్రేక్షకులను అలరిస్తాడని రామ్ చరణ్ అభిమానులు భావిస్తున్నారు. రామ్ చరణ్ ఇప్పటికే వైవిధ్యభరితమైన పాత్రల కోసం వెతుకుతున్నప్పటికి ఆయనకి రూరల్ బ్యాక్ డ్రాప్ కథలే వస్తున్నాయి. ప్రస్తుతం కొంతమంది దర్శకులు డిఫరెంట్ సబ్జెక్ట్ లతో రామ్ చరణ్ ను సంప్రదిస్తున్నట్టుగా తెలుస్తుంది. రాబోయే రోజుల్లో రామ్ చరణ్ చాలా సంవత్సరాల పాటు గుర్తుండిపోయే క్యారెక్టర్లలో నటించడానికి సిద్ధమవుతున్నాడు...

రామ్ చరణ్ లైనప్

ప్రస్తుతం సుకుమార్ డైరెక్షన్ లో చేస్తున్న మూవీ పూర్తయిన తర్వాత పాన్ ఇండియా స్టార్ డైరెక్టర్స్ సందీప్ రెడ్డి వంగ, ప్రశాంత్ నీల్ కాంబినేషన్లు రామ్ చరణ్ లైనప్ లో ఉన్నట్టుగా సమాచారం. ఇది వర్కౌట్ అయితే రామ్ చరణ్ క్రేజ్, మార్కెట్ అమాంతం తార స్థాయి కి వెళ్లే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి...

అందమైన ఐవరీ రంగు చీరలో అద్భుతంగా కనిపిస్తున్న జాన్వీ కపూర్

- కివీస్‌పై మూడో టీ20లో టీమిండియా ఘన విజయం
- యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ 38 బంతుల్లోనే 113 పరుగులు
- పవర్‌ప్లేలో 118 పరుగులు చేసి ప్రపంచ రికార్డు సృష్టించిన భారత్
- ఈ విజయంతో 3-0 తేడాతో టీ20 సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమిండియా
- భారీ లక్ష్యాన్ని కేవలం 13.2 ఓవర్లలోనే ఛేదించిన భారత జట్టు

న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. పరుగుల సునామీ సృష్టిస్తూ కేవలం 38 బంతుల్లోనే 9 ఫోర్లు, 11 సిక్సర్ల సహాయంతో 113 పరుగులు చేయగా, టీమిండియా మరపురాని విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 3-0 తేడాతో

భారత్ కైవసం చేసుకుంది. కివీస్ నిర్దేశించిన 199 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత బ్యాటర్లు ఊది పారేశారు. అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగడంతో ఈ భారీ స్కోరు కూడా చిన్నబోయింది. ఈ పోరులో భారత్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోగా.. న్యూజిలాండ్ బ్యాటర్లు మెరుగైన ఆటతీరు కనబర్చారు. డారిల్ మిచెల్ (52 బంతుల్లో 89 నాటౌట్), ఫిన్ అలెన్ (25 బంతుల్లో 40) మెరుపు ఇన్నింగ్స్‌లతో నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత బౌలర్లలో అర్షదీప్ సింగ్, అక్షర్ పటేల్, నితీశ్ రెడ్డి తలో వికెట్ పడగొట్టారు. అనంతరం 199 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ (19 బంతుల్లో 45) కివీస్ బౌలర్లను ఊచకోత కోశారు. వీరిద్దరూ పవర్‌ప్లేలోనే టీ20 క్రికెట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించారు. తొలి 6 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 118 పరుగులు జోడించారు.

ఇది టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో అత్యధిక పవర్‌ప్లే స్కోరు కావడం విశేషం. ఈ క్రమంలో రొమేనియా (116/0) రికార్డును భారత్ బద్దలుకొట్టింది. కేవలం 2.2 ఓవర్లలోనే 50 పరుగులు, 5 ఓవర్లలోనే 100 పరుగులు పూర్తి చేసి పలు రికార్డులను తమ ఖాతాలో వేసుకుంది. తొలి వికెట్‌కు 133 పరుగుల భాగస్వామ్యం తర్వాత వైభవ్ ఔటైనా, అభిషేక్ తన జోరు కొనసాగించాడు. విధ్వంసకర ఇన్నింగ్స్‌తో 35 బంతుల్లోనే సెంచరీ

పూర్తి చేసుకున్నాడు. అనంతరం అభిషేక్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (5), సంజూ శాంసన్ (18) స్వల్ప వ్యవధిలో ఔటయ్యారు. చివర్లో తిలక్ వర్మ (1), సమీర్ రిజ్వీ? ధీర్ (4) లాంఛనాన్ని పూర్తి చేశారు. దీంతో టీమిండియా కేవలం 13.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి 6 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో సిరీస్‌ను భారత్ 3-0 తేడాతో చేజిక్కించుకోగా, మిగిలిన రెండు మ్యాచ్‌లు నామమాత్రం కానున్నాయి. అభిషేక్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

ఇలాంటి బ్యాటింగ్ ఎప్పుడూ చూడలేదన్న అయ్యర్.. వాళ్లను ఆపడం కష్టమన్న శాంట్నర్

న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో టీమిండియా చారిత్రక విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన ఓపెనర్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీలపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఇరు జట్ల కెప్టెన్లు వారి విధ్వంసకర బ్యాటింగ్‌ను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ముఖ్యంగా భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ప్రత్యర్థి సారథి మిచెల్ శాంట్నర్ ఆ ఇద్దరినీ ఆకాశానికెత్తేశారు.

ఈ అద్భుత ప్రదర్శనపై మ్యాచ్ అనంతరం శ్రేయస్ అయ్యర్ స్పందిస్తూ.. "నిజంగా అద్భుతం. వారిద్దరూ ఆడిన షాట్లు కళ్లకు చాలా ఇంపుగా అనిపించాయి. నేను, సంజూ బ్యాటింగ్‌కు వెళ్లినప్పుడు బంతి సీమ్ అవుతోంది. వాళ్లిద్దరూ ఇలాంటి పిచ్‌పై అంత సులువుగా ఎలా ఆడగలిగారని ఆశ్చర్యపోయాను. ఇది నమ్మశక్యం కాని విషయం" అని అన్నాడు. అంతర్జాతీయ స్థాయిలో ఇలాంటి బ్యాటింగ్ చూడటం ఇదే మొదటిసారని, ఐదు ఓవర్లలోనే 100 పరుగులు చేయడం ఎప్పుడూ చూడలేదని అయ్యర్ కొనియాడాడు. వారి ప్రదర్శన అన్నింటికంటే అత్యుత్తమమని ప్రశంసించాడు. మరోవైపు, న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ కూడా భారత ఓపెనర్ల బ్యాటింగ్‌కు ఫిదా అయ్యాడు. "వాళ్లు అలా చెలరేగి ఆడుతుంటే ఆపడం చాలా కష్టం. వారి విధ్వంసకర బ్యాటింగ్‌ను గతంలో ఐపీఎల్‌లో చూశాం. ఇప్పుడు మా దేశంలో ప్రత్యక్షంగా చూశాం. పవర్‌ప్లేలో ఎలా బ్యాటింగ్ చేయాలో వాళ్లు నిరూపించారు" అని శాంట్నర్ వ్యాఖ్యానించాడు. మంగళవారం వెల్లింగ్టన్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ (113), వైభవ్ సూర్యవంశీ (45) తొలి వికెట్‌కు 133 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. పవర్‌ప్లేలో రికార్డు స్థాయిలో 118 పరుగులు సాధించి భారత భారీ విజయంలో ప్రధాన భూమిక పోషించారు.

సార్.. తమరు అద్భుతంగా ఆడారు: శిష్యుడి సెంచరీపై యువీ కామెంట్

తన శిష్యుడు అభిషేక్ శర్మ న్యూజిలాండ్‌పై రికార్డు శతకంతో చెలరేగిన వేళ, భారత మాజీ డాషింగ్ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ సోషల్ మీడియా వేదికగా ఆసక్తికరంగా స్పందించాడు. ఒకవైపు తన రికార్డును గుర్తుచేస్తూ సరదాగా ఆటపట్టిస్తూనే, మరోవైపు శిష్యుడి అద్భుత ప్రదర్శనను మనసారా ప్రశంసించాడు. ఈ గురుశిష్యుల మధ్య జరిగిన సంభాషణ ఇప్పుడు క్రీడాభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 15 బంతుల్లో హాఫ్ సెంచరీ, 35 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి న్యూజిలాండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. మరో యువ కెరటం వైభవ్ సూర్యవంశీ (18 బంతుల్లో 45)తో కలిసి జట్టుకు అద్భుత ఆరంభాన్నిచ్చాడు. వీరిద్దరి ధాటికి భారత్ కేవలం 5 ఓవర్లలోనే 100 పరుగులు చేసి రికార్డు సృష్టించింది. ఈ అద్భుత ఇన్నింగ్స్ అనంతరం అభిషేక్ తనదైన శైలిలో 'మెడిటేషన్'తో సెలబ్రేట్ చేసుకున్నాడు. అభిషేక్ ఇన్నింగ్స్ అనంతరం సోషల్ మీడియా వేదికగా స్పందించిన యువరాజ్ సింగ్, తొలుత సరదాగా టీజ్ చేశాడు. "నువ్వు 12 బంతుల్లో 50 పరుగులు ఇంకా చేయలేదు!" అంటూ 2007 టీ20 ప్రపంచకప్‌లో

తన రికార్డును గుర్తు చేశాడు. అందుకు అభిషేక్ శర్మ స్పందిస్తూ... "అలాంటి ఫీట్లు (12 బంతుల్లో 50) చేయడం అంత సులభం కాదు.. ఇలాంటివి ఎప్పుడో కానీ సాధ్యం కావు... అన్ని వేళలా అలా ఆడాలంటే కష్టం" అని వినమ్రంగా చెప్పాడు. అయితే, వెంటనే మరో ట్వీట్‌లో యువీ తన శిష్యుడిపై ప్రశంసల వర్షం కురిపించాడు. "నేను 30-34 బంతుల్లో 100 పరుగులు చేయలేను. సార్, మీరు అద్భుతంగా ఆడారు! గొప్ప ఇన్నింగ్స్. సెంచరీ సాధించే క్రమంలో తమరు సింగిల్స్ కూడా తీశారు" అంటూ ఫన్నీ కామెంట్స్ చేశాడు. అంతేకాదు, యువీ ఇతర ఆటగాళ్లపైనా తన స్పందన తెలియజేశాడు. మరో ఎండ్‌లో వైభవ్ సూర్యవంశీ కూడా అదరగొట్టాడని కొనియాడాడు. సంజూ శాంసన్ జట్టు కోసం మూడో స్థానంలో ఆడటం గొప్ప విషయం అని అభినందించాడు. "200 లోపు స్కోరుకు ప్రత్యర్థిని కట్టడి చేసిన మన బౌలర్లకు అభినందనలు. అద్భుత సిరీస్ విజయం" అంటూ టీమిండియాపై ప్రశంసల జల్లు కురిపించాడు.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776